ninadam.in

# నినాదం

తెలుగు దినపత్రిక

నిఖార్సైన జర్నలిజం

గురువారం, జనవరి 15, 2026 | సంపుటి - 22 | సంచిక 114 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
నినాదం
సంక్రాంతి శుభాకాంక్షలు

**సెలవు**

సంక్రాంతి పర్వదినం సందర్భంగా నేడు నినాదం ప్రధాన కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

## తీగ లాగితే.. కదులుతున్న డొంక..!

- రిజిస్ట్రేషన్ రుసుము వ్యవహారంలో
- తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై అనుమానాలు
- కూపీ లాగుతున్న అధికారులు




**హైదరాబాద్,జనవరి14(నినాదం):**

ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ`చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం అవుతున్నాయి. ఎసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు`రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన

▸▸తరువాయి 2లో..



## లిల్లీ మేరీ.. ఇదేం లొల్లి..?

### నర్సింగ్ హాస్టల్లో గందరగోళం

- సెలవులు ఇవ్వనన్న ప్రిన్సిపల్
- రెండు రోజులు డైట్ లేదన్న కాంట్రాక్టర్

**జగిత్యాల ప్రతినిధి జనవరి 13 నినాదం**

జగిత్యాల నర్సింగ్ హాస్టల్లో గందరగోళం నెలకొంది. లిల్లీ మేరీ ఇన్చార్జి ప్రిన్సిపల్ సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు సెలవు ఇచ్చేది లేదని తెగేసి చెప్పింది. వైస్ ప్రిన్సిపల్ మధువాని హిందువులకు పెద్ద పండుగ సంక్రాంతికి విద్యార్థులకు సెలవు ఇవ్వకపోతే ఎలా మేడం అంటూ లిల్లీ మేడమ్ లు రిక్వెస్ట్ చేసింది. స్థానికంగా లేని లిల్లీ మేడం వైస్ ప్రిన్సిపల్ మధు వానితో నిక్కచ్చితంగా సెలవులు ఇచ్చేది లేదని విద్యార్థులందరూ బుద్ధిగా చదువుకోవాలని హుకుం జారీ చేసింది. దీంతో డైట్ కాంట్రాక్టర్ రాజేశ్వర్ రెడ్డి ఎంట్రీ అయ్యారు. సంక్రాంతి పండుగకు విద్యార్థులు సెలవులు ఇవ్వకపోతే ఈ రెండు రోజులు నేను డైట్ పెట్టే ప్రసక్తే లేదంటూ చెప్పి వెళ్లిపోయారు. ఈ వివాదంలోకి నర్సింగ్ కళాశాల ఆఫీస్ సూపర్డెంట్ రాజగోపాల్ ఎంట్రీ అయ్యారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ లిల్లీ మేడం సంక్రాంతి పండుగకు సెలవులు ఇవ్వక... డైట్ కాంట్రాక్టర్ డైట్ పెట్టనడం ఏంటయ్యా తమాషా చేస్తున్నారంటూ వివాదాన్ని సర్దుమనిగే ప్రయత్నం చేశారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ లిల్లీ మేడం పట్టుదలతో నర్సింగ్ కళాశాల విద్యార్థుల సెలవు సమస్య కమ్యూనల్ మారిపోయింది.

▸▸తరువాయి 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భోగిమంటలు వేసిన ప్రజలు



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

2

## అమెరికాలో చేరేది లేదు

గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్



**కోపెన్‌హాగెన్, నినాదం:**

అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు.

2

## ఇరాన్‌ను తక్షణమే వీడండి

**భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక**

ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది.





- 19న మేడారం గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం
- అనసూయ సీతక్క

## 18న మేడారానికి సీఎం, మంత్రుల రాక

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (ములుగు) (నినాదం):**

ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు మేడారానికి రానున్నారని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులకు సూచించారు.

2

## ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ

**పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త - ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు**

**అమరావతి, నినాదం:**

సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం బుధవారం చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండగ వేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే.




## 600 కుక్కలను హతమార్చి పాతిపెట్టిన సర్పంచ్‌లు



- కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన
- జంతు ప్రేమికుల ఫిర్యాదుతో వెలికితీసి పోస్ట్‌మార్టమ్

**కామారెడ్డి, నినాదం:**

మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గులికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహిళల అవమానాన్ని సహించేది లేదు



- మహిళా ఐఎఎస్‌పై అసత్య కథనాలు
- అందుకే చట్టప్రకారం విలేకర్ల అరెస్ట్
- విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా
- రాత్రికి రాత్రే ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేసుకొని పరారీ
- అందుకే ఇద్దరిని అరెస్ట్ చేశాం.. వివరాలు వెల్లడిస్తాం
- మీడియాతో పోలీస్ కమిషనర్ సజ్జన్నార్
- మహిళపై ఉద్దేశ్యపూర్వక దుష్ప్రచారం
- వ్యక్తిగత దాడులు.. చరిత్ర హననం.. అసభ్య వ్యాఖ్యలు
- ఎక్స్ వేదికగా సజ్జన్నార్ ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,జనవరి14(నినాదం):**

ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు.

## విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు

- రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2

## జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండిరచారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు.

## ఉరితాళ్లుగా చైనా మాంజా

- సంగారెడ్డి జిల్లాలో దారుణం
- బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ
- తీవ్రగాయంతో మృతి చెందిన వ్యక్తి
- కర్నాకటలోనూ చైనా మంజా పంజా
- బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా
- తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి



వివరాలు 6 2



## అమెరికాలో చేరేది లేదు

వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.

## 600 కుక్కలను హతమార్చి పాతిపెట్టిన సర్పంచ్‌లు

ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికి తీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఉరితాళ్లుగా చైనా మాంజా

సంగారెడ్డి, నినాదం:

సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వెక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్త స్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వెక్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ.1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ఇరాన్‌ను తక్షణమే వీడండి

**న్యూఢిల్లీ, నినాదం:**

ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు మరియు భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్టులు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

## ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ

ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండిరగులో ఉన్న బిల్లులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించింది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు. డీఏ, డీఆర్ఏ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్ఏ బకాయిలు జమ కావడంతో ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో ఈ నిధులను ఆర్థిక శాఖ జమ చేస్తోంది. ప్రభుత్వానికి, సీఎంకు ఉద్యోగ సంఘాలు సైతం కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ నిధుల జమపై ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పందించారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి సంక్రాంతి పండుగను తామందరం చాలా సంతోషంగా జరుపుకుంటామని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబును కలిసి సరెండర్ లీవులకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పోలీసులు అందరి తరపున కృతజ్ఞతలతోపాటు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు. అలాగే ఈ నిధులు విడుదలకు సహకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోమ్ మంత్రి అనితతోపాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి ఈ సందర్భంగా శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు.

# 18న మేడారానికి సీఎం, మంత్రుల రాక

సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి మేడారం చేరుకున్న అనంతరం ఇక్కడే బస చేయనున్నారని, 19న శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. సీఎం పర్యటనను అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులను కోరారు. 18న ఆదివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు జిల్లాలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ధింసా, కోయ, గుస్సాడి, కొమ్ము కోయ తదితర సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రత, రూట్ మ్యాప్, పార్కింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

సీఎం మేడారం పర్యటన నేపథ్యంలో, జాతర పనుల పురోగతిని మంత్రి సీతక్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణం చుట్టూ కొనసాగుతున్న ల్యాండ్ స్కేపింగ్ పనులను పరిశీలించారు. ఆదివాసీ–గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ల్యాండ్ స్కేపింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో ఔషధ వనమూలికలు, ఇప్ప పువ్వు వంటి సంప్రదాయానికి ప్రాధాన్యమైన మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ల్యాండ్ స్కేపింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న క్యూ లైన్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యాల దృష్ట్యా పనుల్లో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్డీఓ



వెంకటేష్, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణిత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లిల్లీ మేరీ.. ఇదేం లొల్లి..?



### అసలు ఏ జరిగిందంటే..!

జగిత్యాల నర్సింగ్ కళాశాల వసతి గృహంలో 180 మంది విద్యార్థులు ఉంటారు. ఇందులో 17 మంది సెంట్రల్ గవర్నమెంట్ కోటా కింద అడ్మిషన్ తీసుకున్నారు. మిగతా 163 మంది తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి అడ్మిషన్ తీసుకొని హాస్టల్లో వసతి పొందుతున్నారు. మంగళవారం రోజు జిల్లా పోలీస్ శాఖలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పూర్తిచేసరికి సాయంత్రం నాలుగు దాటింది. పైగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ ఉద్యోగరీత్యా సిద్దిపేటలో ఉన్నారు. వైస్ ప్రిన్సిపల్ మధువాణి చూస్తున్నారు. హాస్టల్ కి వచ్చిన విద్యార్థులు పండగ ఇంటికి వెళ్తామని వైస్ ప్రిన్సిపాల్ ను అడిగారు. సాధారణంగా నర్సింగ్ విద్యార్థులకు సంవత్సరం పొడవున 30 సెలవు దినాలు మాత్రమే వాడుకోవలసి ఉంటుంది. దసరా పండక్కి 10 రోజులు సమ్మర్ నీటి ఎద్దడి ఉంటుంది కాబట్టి 15 రోజులు దినాలు వినియోగించుకుంటే మిగతా ఐదు రోజులు ఇలాంటి పండగల కోసం ఒకటి రెండు రోజులు కేటాయించుకుంటే మొత్తం 30 రోజులు సెలవు దినాలు నిండాలి. 25 రోజులు సెలవు దినాలు నర్సింగ్ విద్యార్థులు వినియోగించుకున్నారు కాబట్టి సంక్రాంతి పండుగకు వెళ్లాల్సిన అవసరం లేదని లిల్లీ మేరీ ఒంటెత్తు పోకడతో నిక్కచ్చితంగా మాట్లాడడంతో విద్యార్థులు అవాక్కయ్యారు. దీంతో వైస్ ప్రిన్సిపల్ మధువాని కూడా ఆశ్చర్యాన్ని గురైంది. రెండు రోజులు డైట్ కలిసొస్తుందని సెలవు దినాల్లో డైట్ పెట్టనని డైట్ కాంట్రాక్టర్ తెగేసి చెప్పడంతో పాటు ఈ సమస్యను పబ్లిక్ చేయడంలో కీలకపాత్ర పోషించాలని కళాశాల వర్గాలు చెబుతున్నాయి. సమస్య బయటికి రావడంతో. కలెక్టర్ దృష్టికి వెళ్లగా కలెక్టరేట్ ఏవో ఫోన్ ద్వారా ప్రిన్సిపల్ లిల్లీ మేరీ తో మాట్లాడగా సెలవులు మంజూరు చేసి విద్యార్థులను ఇండ్లకు పంపించారు. ఇందులో ఫోన్లు లాక్కొని.. విద్యార్థులను ఇబ్బందుల గురిచేసిన మాట అవాస్తవమనీ నర్సింగ్ కళాశాల అధికారులు చెబుతున్నారు. కేవలం సెలవు దినాలు తక్కువ ఉండడంతోనే ఇన్చార్జి ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ సంక్రాంతి పండుగకు సెలవులు ఇవ్వలేదనేది కళాశాల వర్గాలు వెనుకేసుకొస్తున్న పరిస్థితి. లిల్లీ మేడం కొంచెం ఆలోచించి ఉంటే ఈ సమస్య తలెత్తి ఉండేది కాదని ఆఫీస్ వర్గాలు చెప్తున్నాయి. ఏది ఏమైనా లిల్లీ మేడం పెట్టిన లొల్లి జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సమస్యలోకి ఓ ప్రజా ప్రతినిధి ఎంట్రీ అయిపోయి విద్యార్థులను పాకిస్తాన్ నుంచి లేక బంగ్లాదేశ్ నుంచి బందీలను విడిపించినంత బిల్డప్ ఇచ్చారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### పొద్దున పంపిస్తా అన్నందుకు ఇంత రాదంతమా..!

**- లిల్లీ మేరీ.. ఇన్చార్జి ప్రిన్సిపాల్ నర్సింగ్ కళాశాల..**

హాస్టల్లో 180 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో చాలామంది పోలీస్ శాఖ నిర్వహించిన రంగోలి కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం 6 గంటలకు హాస్పిటల్ కి చేరుకున్నారు. సాయంత్రం 6 గంటలకు విద్యార్థులను ఇండ్లకు పంపించలేం. కాబట్టి ఉదయము ఇతర కళాశాలలో ఏ విధంగా వ్యవహరిస్తున్నారో కనుక్కొని విద్యార్థులకు సెలవులు మంజూరు చేస్తానని చెప్పాం. ఇంతలో మెస్ కాంట్రాక్టర్ విద్యార్థులకు భోజనం పెట్టనని చెప్పి వెళ్ళిపోయారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులందరూ సెలవులకు వెళ్లరు. భోజనం పెట్టనని చెప్పడం కరెక్ట్ కాదని కాంట్రాక్టర్లు మందలించి విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశాం. 12 న ఇండ్ల నుండి వచ్చి చేరారు. రెండు రోజులు సెలవు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ రాష్ట్రంలోని చివరి జిల్లాలకు ఆడపిల్లలు వెళ్లాలంటే తల్లిదండ్రుల పర్మిషన్ తీసుకొని పంపించాలి. ఇవన్నీ గమనించకుండా ఇస్తాను సారంగా ఆరోపణలు చేయడం సరి అయింది కాదు.

## తీగ లాగితే.. కదులుతున్న డొంక..!

ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు. ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు వీటిపై ఎన్ఐసీ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం. సాగు భూముల రిజిస్ట్రేషన్లకు అత్తెసరు ఛార్జీలు చెల్లించినా వాటిని ఆమోదించి డీడ్స్‌పై సంతకాలు చేసిన తహసీల్దార్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సెంటర్‌లో చలానా చెల్లించి నిర్దిష్ట తేదీన తహసీల్దారు`సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్దకు భూముల క్రయ, విక్రయదారులు, నలుగురు సాక్షులు కూడా వస్తారు. పాసుపుస్తకాలను, ఫొటోలను, సెల్ నంబర్లను పరిశీలించుకోవడం, రికార్డుల్లో ఉన్న వ్యక్తి, హాజరైన యజమాని ఒక్కరేనా అనేది తేల్చుకోవడం తహసీల్దారు బాధ్యత. దీంతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకే చెల్లించారా అనేది కూడా తప్పనిసరిగా పరిశీలించడమనేది మరో ముఖ్యమైన విధి. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ ముఖ్య సహాయకుడిగా పనిచేయాలి. కీలక బాధ్యతల విషయంలో తహసీల్దార్లు, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర అంశంగా రెవెన్యూ శాఖ భావిస్తోంది.




## పడిపోయిన టమోటా ధరలు

**మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం**

మదనపల్లె : మదనపల్లెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళవారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటు తుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు.

## మరోమారు రాజ్యసభకు నో

**దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన**

భోపాల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది.షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# మహిళల అవమానాన్ని సహించేది లేదు

అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

**అవమానాన్ని సహించేది లేదు**

తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచిన కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ నడువనుంది. ఇదిలా ఉండగా.. మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరమని అన్నారు. ఇకపై మహిళలను అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇల్లు`ఉద్యోగం రెండిరటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే.భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' .. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షం ఉంటుంది. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరం. వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మహిళలను గౌరవించని సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టం. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.



## అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు.జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

## విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు

తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిరచారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

గురువారం
15 జనవరి 2026


# మినీ మేడారం వీణవంకలో సమ్మక్క సారక్క జాతర పనులు ప్రారంభం

**ప్రత్యేక పూజలు నిర్వహించిన పాడి ఉదయ్ నందన్ రెడ్డి**
**ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు..**
**అధికారులకు సూచించిన యాప్ టీవీ సీఈవో**

**జమ్మికుంట, జనవరి 14 (నినాదం)**

మినీ మేడారం గా పిలిచే వీణవంక మండల కేంద్రం లోని సమ్మక్క సారమ్మ జాతర పనులు యాప్ టీవీ సీఈవో పాడి ఉదయ్ నందన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామస్తులతో కలిసి కొబ్బరి కాయ కొట్టి జాతర పనులను ప్రారంభించిన యాప్ టీవీ సీఈవో ఉదయ్ నందన్ రెడ్డి.వీణవంక మండల కేంద్రంలో మినీ మేడారంగా పిలవబడే సమ్మక్క సారలమ్మ జాతర 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పెద్ద మొత్తంలో ఉత్సవాలను నిర్వహించేందుకు యాప్ టీవీ అధినేత పాడి ఉదయానంద రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976 వ సంవత్సరంలో



ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర నిర్విరామంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు మినీ మేడారంగా సంస్కృతిని సాంప్రదాయాన్ని ప్రతి బింబించే విధంగా ఉత్సవాలు జరిగేలా ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీటితోపాటు వసతి సౌకర్యం వైద్య సౌకర్యము ఏర్పాటు చేయడం జరుగుతుందని భక్తులందరూ సమ్మక్క సారలమ్మను దర్శించుకుని వెళ్లాలని కోరారు.

**అందరూ ఆహ్వానితులే...**

వీణవంకలో నిర్వహించే సమ్మక్క సారక్క జాతరకు రాష్ట్రంలోని ఉన్నత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా పలువురు మంత్రులను ఆహ్వానించినట్లు ఉదయ్ నందన్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకుని వన దేవతల ఆశీస్సులు పొందాలని కోరారు. తమ ఆధ్వర్యంలో గత 50 సంవత్సరాలుగా సమ్మక్క సారలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని 50 ఏళ్లుగా అమ్మవారి సేవలో మా కుటుంబ పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. అమ్మవార్ల దీవెనలతో వీణవంక మండల ప్రజలు చుట్టుపక్క ప్రాంత ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# క్రీడలు విద్యార్థులకు బంగారు భవిష్యత్తునిస్తాయి

**మాడే మంగయ్య**

**గుండాల, జనవరి 14 (నినాదం):**

మండల కేంద్రంలో పలు గ్రామాలలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, కోకో క్రీడలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేశారు. బుధవారం క్రీడలు కంప్లీట్ కావడంతో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త మాడే మంగయ్య చింతలపాడు గ్రామంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారితోపాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించారు.చింతల పాడు గ్రామంలో క్రీడలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ ద్వితీయ బహుమతులు అందించడంతో చింతల పాడు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అలాగే దామరతోగు గ్రామంలో వాలీబాల్, కోకో క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు బంగారు భవిష్యత్తునిస్తాయని, గ్రామాలలో ఉన్నత చదువు చదువుకున్న ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని సత్తా సాటాలని అన్నారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలలో సైతం ఇలాంటి క్రీడాకారులు ఉన్నారా అని ఆశ్చర్యం కలిగిందన్నారు. యువతి యువకులు ముందు ముందు మరింత ఉత్సాహంగా క్రీడలలో పాల్గొని మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

# సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన

# మంత్రి జూపల్లి కృష్ణారావు







**నిర్మల్ ప్రతినిధి, జనవరి 14.(నినాదం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 16 న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతిష్టాత్మక సదర్మాట్ బ్యారేజీని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి బుధవారం బ్యారేజీ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, ప్రారంభోత్సవ వేదిక, భద్రతా ఏర్పాట్లు, బ్యారేజీ గేట్లను పరిశీలించారు. బ్యారేజీ ఆయకట్టు రైతాంగ కల సాకారమవుతున్న తరుణంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఎమ్మెల్యే , డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు, కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి, మాజీ మంత్రులు సముద్రాల వేణుగోపాలచారి, ఐ కె రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## గోదావరిలో సంక్రమణ పుణ్య స్నానాలు

**ధర్మపురి ప్రతినిధి జనవరి 14 ( నినాదం )**

మకర సంక్రాంతి పండుగ సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. బస్సుల్లో పలు ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు మధ్యాహ్నం పుణ్య సమయంలో గోదావరి తీరాన అధిక సంఖ్యలో సంక్రమణ పుణ్య స్నానాలు ఆచరించారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు ప్రత్యేక తిల తర్పణాలు చేశారు.అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.





# ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే ప్రాధాన్యత

**నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్**

**కరీంనగర్, జనవరి 14(నినాదం)**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రచురించిన పోలింగ్ కేంద్రాల అభ్యంతరాల నేపథ్యంలో బుధవారం రోజున నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమావేశం నిర్వహించారు. 66 డివిజన్లకు సంబంధించి ఇటీవల ప్రచురించిన పోలింగ్ కేంద్రాల జాబితా లో ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రాధాన్యత గా తీసుకున్న వివిధ అంశాల పై పార్టీల ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం. వివిధ పార్టీల ప్రతినిధులు పలు డివిజన్లకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల మార్పు చేర్పుల పై అభ్యంతరాలను కమీషనర్ దృష్టికి తెచ్చి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనలను అనుసరించి ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీస్కుంటున్నామని తెలిపారు.నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే ప్రాధాన్యత, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీస్కుంటున్నామని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రధానంగా ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను మొదటి ప్రాధాన్యత గా పరిగణలోకి తీస్కొని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవి సరిపోని యడల ప్రైవేటు విద్యా సంస్థల భవనాలను పరిగణలోకి తీస్కొని ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాల జాబితాను మ్యాపింగ్ చేశామన్నారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేసి పరిశీలించిన అనంతరమే ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రధానంగా ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గాలి వెలుతురు ఉండేలా... సరైన పార్కింగ్ స్థలం, క్యూ లైన్ కు స్థలం, రెండు దారులు, ర్యాంపులు, విద్యుత్, సరైన ఫర్నిచర్ ఉండేలా. పోలింగ్ కేంద్రానికి రక్షణగా పహారి గోడ నిర్మాణం తదితర వసతులు, సౌకర్యాలు ఉండేలా చర్యలు తీస్కోని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నగర వ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా వేగవంతంగా జరిగేలా యొక్కప్రతి పోలింగ్ బూత్ వారిగా 800 ఓటర్లకు మించకుండా తగిన చర్యలు తీస్కున్నామని తెలిపారు. డివిజన్ల వారిగా ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రం ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. ఉన్న లొకేషన్ ప్రకారం ఎలాంటి అభ్యంతరాలు ఉన్న పరిగణలోకి తీస్కోని... తగిన చర్యలు తీస్కుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల లొకేషన పై ఇచ్చిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీస్కుంటామని తెలిపారు. 14 వ తేది సాయంత్రం 9 గంటల వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం లో స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. 16 వ తేదిన డివిజన్ల పోలింగ్ స్టేషన్ వారిగా ఓటర్ల జాబితా తో పాటు పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనలను అనుసరించి మిగితా ప్రక్రియను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ నగర అధ్యక్షులు అంజన్ కుమార్, బీజేపి నాయకులు నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం నాయకులు అబ్బాస్ సమీ, అసీం, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్ కంసాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాస్, అబ్దుల్ రహెమాన్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు బండారి శేఖర్, జనసేనా నాయకులు రాజిరెడ్డి, హరిష్, టీడిపి నాయకులు ఎర్రవెళ్లి రవీంధర్, బిఎస్పీ నాయకులు నల్లాల శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

**కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు**
**రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్**

**మహేశ్వరం జనవరి 14 ( నినాదం)**

కడ్తాల్ మండల ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాల మధ్యజరుపుకోవాలని మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు.ఈ సందర్భంగా ప్రజలకు ఆయన భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ సంస్కృతి–సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళతెలుగులో గిల్లులలనాటి అనుభూతులకు వేదికలుగా మారుతాయని అన్నారు ప్రతి ఒక్కరూ పండుగ సమయానికి తమస్వగ్రామాలు,ఇళ్లకు చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారని తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకించి ఉదయాన్నే వేసే ముగ్గులు, గొబ్బెమ్మలు, అక్కడి సందడి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు ధాన్యం ఇళ్లకు చేరే ఈ సమయంలో



రైతులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారు సిరిసంపదలతో ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా భోగి మంటలు, రంగురంగుల ముగ్గులు,గంగిరెద్దుల విన్యాసాలు,హరిదాసుల పాటలు,గాలిపటాల సందడి పండుగ శోభను మరింత పెంచుతాయని అన్నారు. ఇళ్లల్లో పిండివంటలు, పశువుల అలంకరణలతో సంక్రాంతి పండుగ ఒక ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంటుందని తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలోప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,ఎలాంటి ప్రమాదాలుజరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కడ్తాల్ మండల ప్రజలంతా పండుగను ప్రశాంతమైన,సురక్షిత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# పత్తిపాక సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు

**ధర్మారం జనవరి 14 (నినాదం)**

మండలంలోని పత్తిపాక గ్రామంలో ఈ రోజున సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ మాట్లాడుతూ గ్రామం లోని మహిళా సోదరిమణులను ఉత్సహపరచుటకు మరియు వారిలో ఉన్న కళ ప్రదర్శించుటకోసం ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ముగ్గుల పోటీలో విజేతలుగా





నిలిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కంసోలేషన్ బహుమతులను సర్పంచ్ శ్రావణి చేతులమీదుగా ప్రధానం చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పూసాల మల్లేశం, పంచాయతి సెక్రెటరీ తాళ్ల కిరణ్, వార్డు సభ్యులు ఏదుల అంజయ్య, గాజుల మునీందర్, ఎల్మదాసరి అంజమ్మనర్సయ్య జిల్లాల కాంతా రాజు, కాంపెల్లి కొమురయ్య, కర్నే నరేష్, రేషవేణి మహేష్, ఏఎన్ఎం లక్ష్మి ,వివో మమత, అంజలి మరియు గ్రామ మహిళలు గ్రామ ప్రజలు యువశక్తి యూత్ సభ్యులు సిద్ధార్థ, ఆదర్శ్, సోను, నితిన్, చిరు,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను అరెస్టు చేయడం అన్యాయం

**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ కే బాపురావు**
**అక్రమ అరెస్టులను ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్**



**జమ్మికుంట, జనవరి 14 (నినాదం)**

ఎన్టీవీ మీడియాలో ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై ప్రసారమైన కథనంపై ఎటువంటి విచారణ చేయకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా సిట్ పోలీసులు ఓ ముగ్గురు సీనియర్ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఎన్టీవీలో వచ్చిన కథనానికి జర్నలిస్టులు దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ లను బాధ్యులను చేస్తూ 'సిట్' పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేయడం దారుణమని ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ కుడుతాడి బాపురావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే కథనాలకు ఆ సంస్థ ఎడిటర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో పాటు సంస్థ యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని, కానీ ఆ సంస్థలో పని చేసే జర్నలిస్టులను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేసి అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తమది ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...తన ప్రభుత్వంలోని అధికారులు అనుసరిస్తున్న విధానంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిజంలో మూడు దశాబ్దాలుగా పని చేస్తున్న ఈ ముగ్గురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం వెనుక కుట్ర ఉన్నట్లు కనిపిస్తోందని, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే సదరు జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారని తెలిపారు. జర్నలిజం వృత్తిలో అనేక మంది జర్నలిస్టులు బహుజన వర్గాలకు చెందినవారని, సరైన వేతనాలు లేకపోయినా...వృత్తి పట్ల ఆసక్తితో యాజమాన్యాలు చెప్పినట్లు పని చేయాల్సివస్తుందని అన్నారు. బలహీనవర్గానికి చెందిన ఈ ముగ్గురు జర్నలిస్టులను సిట్ అధికారులు అరెస్టు చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని బాపురావు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, సిట్ పర్యవేక్షణాధికారి సజ్జనార్ కు విజ్ఞప్తి చేశారు. బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా అమాయక జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైందికాదని, ఈ అక్రమ అరెస్టులు ఇతర జర్నలిస్టులను భయపెట్టేందుకు చేస్తున్న చర్యలని అన్నారు.



# రంగుల హరివిల్లు.. ముగ్గుల పోటీలు

**రోడ్డు భద్రత అవగాహనపై ముగ్గుల పోటీలు**
**అభినందించిన హుజురాబాద్ వెహికల్ ఇన్స్పెక్టర్**
**తనిఖీ అధికారి కంచె వేణు**

**జమ్మికుంట, జనవరి 14 (నినాదం)**

జాతీయ రోడ్డు రవాణా భద్రత మాసోత్సవ సందర్భంగా రవాణా శాఖలో హుజురాబాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించారు.వీటిని రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలలో భాగంగా లేదా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తారు, విజేతలకు బహుమతులు అందజేస్తారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు, ట్రాఫిక్ నిబంధనల పాటించడం గురించి తెలియజేయడానికి వీటిని ఉపయోగిస్తారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కంచి వేణు మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరం ముందుగా బయలుదేరి క్షేమంగా గమ్యాన్ని చేరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ వాహనాలు నడపకూడదు. ట్రాఫిక్ ను గమనించి సహనంతో దాటాలి. క్షేమముగా చేరుటకు ఏకైక మార్గం, డ్రైవర్ల తమ పక్కన ఎవరిని ఎక్కించుకోకూడదు. అతివేగం ప్రమాదకరం మలుపులు రద్దీగా ఉండే ప్రదేశాలలో వాహనాన్ని నెమ్మదిగా నడపాలి. సరియగు హారన్ ఉపయోగించాలి. రాత్రి సమయంలో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హెడ్ లైట్ డిప్ చెయ్యాలి. నిర్ధారిత స్థలంలో వాహనములను పార్కు చేయాలి. రాత్రి వేళలో వాహనాన్ని నిలిపించినప్పుడు పార్కింగ్ లేట్లు తప్పనిసరిగా వేయాలి. వాహనము నడిపేటప్పుడు పక్కవారితో సంభాషించకూడదు. వాహనము మలుపు తిరిగినప్పుడు, నిలుపుకున్నప్పుడు చేతితో సరైన సంకేతాలు ఇవ్వాలి. పరిమితి మించి మోటార్ క్యాబ్ లో ప్రయాణికులను తీసుకువెళ్లకూడదు.వాహనం నడిపేట ప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. అతివేగం అనర్ధదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలని సూచించారు.ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. టీచర్స్ విద్యార్థులు పాల్గొంటారు, సృజనాత్మకతను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ బుర్ర సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంత సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించాలి

**ధర్మపురి ప్రతినిధి జనవరి 14 ( నినాదం )**

మన దేశ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో మహిళలలు కీలక పాత్ర పోషిస్తున్నారని నేరెళ్ల గ్రామ సర్పంచ్ కాసరపు బాలాగౌడ్ అన్నారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, కోలాటాలు, తదితర కార్యక్రమాల నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడమే కాకుండా మహిళల్లో పరోక్షంగా సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ ఐక్యతను మరింత బలపరిచేందుకే ముమ్మందు మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. గ్రామంలోని మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఈ పోటీలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో గ్రామాన్ని సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు సర్పంచ్ బాలాగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, కాసారపు కొమురయ్య వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నారులకు భోగిపండ్ల వేడుక

**కోదాడ,జనవరి14(నినాదం)**

ఖానాపురంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక భోగిపండ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 50 మంది ఐదేళ్లలోపు పిల్లలకు . సర్పంచ్ కంటు లాజర్, సతీమణి రేణుక భోగిపండ్లు పోసారు. వారు మాట్లాడుతూ. . . గొబ్బెమ్మలు, గొబ్బి పాటలు, హరిదాసులు, చలిమంటలతో సంక్రాంతి పండుగ తెలుగు సంప్రదాయాలతో ఎంతగానో ముడిపడి ఉందన్నారు.చిన్నారులకు రేగుపండ్లు పోయడంలో పలు వైజ్ఞానిక అంశాలు కూడా ఇమిడి ఉన్నాయని తెలిపారు.ఉపసర్పంచ్ జగన్,మాజీ సర్పంచ్ గింజుపల్లి రఘు, వీరయ్య గౌడ్,వార్డు మెంబర్లు ఉపేందర్ ,రామయ్య, గ్రామస్తులు మురళి, సహదేవ, రంగారావు, రామయ్య,పెద్దలు యువత మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బత్తుల అంజి

**కొత్తగూడెం, జనవరి14(నినాదం)**



ములకలపల్లి మండల ప్రజలందరికీ, తెలుగు వారందరికీ జిల్లా కాంగ్రెస్ నాయకులు మరియు మాజీ జడ్పీటీసీ సభ్యులు బత్తుల అంజి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగువారి సంస్కృతి సంప్రందాయాలకు, ప్రత్యేక కళలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతాంగాని మనమిచ్చే గౌరవానికి సంక్రాంతి పర్వదినం ప్రతీక అని అన్నారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరు పచ్చల కళకళలు గ్రామాల్లో సంక్రాంతి శోభను తీసుకువచ్చాయన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను తెలుగు వారంతా సంతోషంగా జరపుకోవాలని బత్తుల అంజి ఆకాంక్షించారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, తెలంగాణ
15 జనవరి 2026

## కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాన్ని రద్దు చేయాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి



**కోదాడ,జనవరి14(నినాదం):** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన బి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... సంవత్సరానికి 100 రోజుల పని దినాలు కనిపించాలని అప్పటి యూపీఐ ప్రభుత్వంతో కొట్లాడి చట్టాన్ని తీసుకొస్తే... ప్రస్తుతం కేంద్రప్రభుత్వం పాత ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి చట్టాన్ని సవరించి కొత్తగా వీబీజీ రాంజీ అనే పేరుతో అనేక రకాల నొసుగులతో కొత్త పథకానికి నాంది పలికారని ఈ చట్టం ఉపాధి హామీ పథకానికి ఎలాంటి గ్యారెంటీ లేకపోగా నిర్వీర్యం చేసేదిగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భారీ స్థాయిలో ఉద్యమిస్తామన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ రఘు



**మెట్‌పల్లి, జనవరి: 14 ( నినాదం):** వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా మెట్ పల్లి నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు నియామకం అయినట్లు జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుమండ్ల మహేష్ బుధవారం తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి, అదేవిధంగా జిల్లాలో యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు కృషి చేస్తారని పేర్కొంటూ ఈ నియామకం జరిపినట్లు తెలిపారు. జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు చిట్నేని సలహాలను, సూచనలను పాటిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రఘు నియామకం పట్ల అసోసియేషన్ సభ్యులు, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నూతనంగా జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ రఘు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామకం పట్ల సహకరించిన అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం



**నర్సంపేట జనవరి 14 (నినాదం):** ఖానాపురం మండలం ధర్మరావుపేట గ్రామంలో గ్రామ తొలి సర్పంచ్ శ్రీ శే ఎర్రబెల్లి కమలాకర్ రావు , బాల్ తండా గ్రామ వ్యవస్థాపకులు బాలునాయక్ , ధర్మరావుపేట జీపీ మొదటి అటెండర్ మాద్రాజు ఉప్పలయ్యల జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచ్ మాద్రాజు వెంకన్న బహుమతులు ప్రధానం చేశారు. అలాగే మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి సర్పంచ్ నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమ నగదు దాత సర్పంచ్ మాద్రాజు వెంకన్న మాట్లాడుతూ పండుగ వేళ గ్రామస్థులందరం ఒక చోట చేరి ఉల్లాసంగా క్రీడలు నిర్వహించుకోవడం ,గ్రామ పెద్దలను స్మరించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మరావుపేట ఉప సర్పంచ్ కొనుకటి రాజు ,బాల్ తండ సర్పంచ్ బానోత్ సునీత బాల కృష్ణ , బాల్ తండ ఉపసర్పంచ్ , వార్డు మెంబర్లు వెంకటేశ్వరరావు ,మోహన్ రెడ్డి , భగత్ యువజన సంఘం అధ్యక్షుడు తక్కలపల్లి కరుణాకర్ ,బహుమతుల దాతలు ఎర్రబెల్లి సంపత్ రావు, కత్తుల వెంకటేశ్వరరావు , లొంక అశోక్ ,బండి సాంబరాజు ,పోతురాజు కరుణాకర్ ,లెంకలపల్లి రవి మహిళా సంఘం సిఏలు అడ్డూరి రేణుక , కోదాటి సమత ,అంగన్ వాడి టీచర్లు గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గోదావరిలో సంక్రమణ పుణ్యస్నానాలు



**ధర్మపురి ప్రతినిధిజనవరి 14 (నినాదం):** మకర సంక్రాంతి పండుగ సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. బస్సుల్లో పలు ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు మధ్యాహ్నం పుణ్య సమయంలో గోదావరి తీరాన అధిక సంఖ్యలో సంక్రమణ పుణ్య స్నానాలు ఆచరించారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు ప్రత్యేక తిల తర్పణాలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## అంగరంగ వైభవంగా బోగి వేడుకలు..!



**పాలేరు, జనవరి 14( నినాదం):** నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో బోగి వేడుకలు అంగరంగ వైభంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఉత్సవాలు చేపట్టారు. నేలకొండపల్లి లో పలు దేవాలయాలలో గోదాదేవి కళ్యానం నిర్వహించారు. కోరట్లగూడెంలో బోగి మంటల వద్ద సందడి చేశారు. బచ్చలకూరి నాగరాజు, కొత్తపల్లి సాయి, గడిపల్లి నవీన్, షేక్ సైదా, షేక్ మహబూబ్, పాషా, గడిపల్లి శ్రీను, షేక్ లాల్పాషా, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో లో జరిగిన సంబురాలలో జెర్రిపోతుల అంజిని, రాయపూడి రోహిత్ తదితరులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో బోగి సంబురాలు ఘనంగా నిర్వహించారు.

## సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఆది పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృత్తం కావద్దు
### అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ





**మహాదేవపూర్ జనవరి 14, (నినాదం):** మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం లో నిర్వహించే సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం కాళేశ్వరం లోని దేవాదాయ శాఖ ఈవో కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్తతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అంత్య పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గత పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, సరస్వతి పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని అందులో 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలని ఫిబ్రవరి మొదటి వారంలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని పుష్కరాల సమయంలో భక్తుల పోకలు, భద్రత, త్రాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా అంటే అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు.

**పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు**

సరస్వతి అంత పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ సిరి శెట్టిసంకీర్త్ తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ వాహనాల పార్కింగ్ భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలను పరిశీలిస్తున్నామని వివరించారు, సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు , వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలను గుర్తించుతామని ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు.

**ఆది పుష్కరాల లాగే అంత్య పుష్కరాలు**

సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవిందా హరి తెలిపారు. అంత్యపుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని పెండింగ్లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కాళేశ్వర క్షేత్రానికి ఉన్న చరిత్ర ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే కాళేశ్వర ఖండం అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని పీఠాధిపతులు హారతి తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అల్వాలపురంలో ముగ్గుల సందడి

### • హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో సంప్రదాయాలకు చిరునవ్వులు



**కోదాడ,జనవరి14(నినాదం):** కోదాడ మండల పరిధిలోని అల్వాలపురం గ్రామం బుధవారం పండుగ వాతావరణాన్ని తలపించింది. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామాన్ని రంగుల కళావేదికగా మార్చాయి. ఇంటి ముందర వేసిన ముగ్గులు గ్రామ సంస్కృతి, మహిళల కళా నైపుణ్యానికి అద్దం పట్టాయి. పోటీలకు గ్రామ మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. రంగురంగుల ముగ్గులు, సంప్రదాయ ప్రతీకలు, ఆధ్యాత్మిక భావాలతో రూపొందించిన ఆకృతులు అందరి దృష్టిని ఆకర్షించాయి. గ్రామ వీధులన్నీ ఒక కళా గ్యాలరీని తలపించాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ, జోగిని మాత కళా స్వామి ముఖ్య అతిథులుగా హాజరై, ముగ్గుల పోటీలను పరిశీలించి మొదటి బహుమతి మద్దెల పూజిత, రెండవ బహుమతి మద్దెల శ్రీలక్ష్మి, మూడోవ పోతురాజు గౌతమి లకు బహుమతులు బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామీణ సంప్రదాయాలను కాపాడే ఇలాంటి కార్యక్రమాలు యువత చేతిలోనే సాధ్యమవుతాయి. హనుమాన్ యూత్ చేపట్టిన ఈ ప్రయత్నం అభినందనీయం" అని ప్రశంసించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. మహిళల ముఖాల్లో కనిపించిన ఆనందం ఈ కార్యక్రమానికి అద్దం పట్టింది. గ్రామంలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంచుతూ, ఐక్యతను చాటేలా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలు అల్వాలపురం గ్రామస్తులకు మరపురాని అనుభూతిని మిగిల్చాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరెగూడెంలో ముగ్గుల పోటీలు..



**పాలేరు, జనవరి 14( నినాదం):** నేలకొండపల్లి మండలం లోని ఆరెగూడెం లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున పోటీలో పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి సుజాత, రెండో బహుమతి గొలుసు' పవిత్ర, మూడో బహుమతి వీనింద్ర, నాల్గొవ బహుమతి ధనమ్మ, ఐదో బహుమతి స్వర్ణ లు పొందారు. కాగా పోటీలో పాల్గొన్న 110 మంది కి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డె విశాల, వార్డు సభ్యురాలు గొలుసు మణి, గౌరింట్ల అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాలనలో విఫలమై ప్రజలను మభ్యపెడుతున్నారు

### • మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి ప్రతినిధిజనవరి 14 (నినాదం):** బీఆర్ఎస్ తమపాలనలో విఫలమై ఇప్పుడు ప్రజలను మభ్యపెడుతున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలు ఆరోపణలు అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని తీవ్రంగా విమర్శించారు. పాలనలో విఫలమై ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని బీఆర్ఎస్ నేతలు అబద్ధాల రాజకీయాలకు దిగుతున్నారని మండిపడ్డారు. కృష్ణా – గోదావరి జలాల అంశంలో ప్రజలను కావాలని తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్, గతంలో ఈ అంశంపై చర్చకు వస్తే అసెంబ్లీ నుంచి పారిపోయారని అన్నారు కృష్ణ--గోదావరి జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పదేళ్లు సంపదను దోచుకున్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. దాని ఫలితంగా నేడు రాష్ట్రం ఆర్థిక భారాన్ని మోస్తోందని అన్నారు. దోపిడీ పాలనకు అలవాటు పడిన బీఆర్ఎస్‌కు ప్రజా ప్రభుత్వం జవాబుదారీ పాలన చూపిస్తోందని దాన్ని జీర్ణించుకోలేక అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనే బీఆర్ఎస్‌కు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని ఇది కేవలం ఆరంభమేనని మంత్రి అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తారని , కాంగ్రెస్ పార్టీ మరోసారి తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసే విమర్శలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలే తప్ప, వాస్తవాలకు దూరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేసారు. మంత్రి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్ మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి

### మారిశెట్టి వెంకటేశ్వరరావు



**పాలేరు జనవరి 14(నినాదం):** అర్ధరాత్రి జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించిన నేలకొండపల్లి మండల సిపిఐ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు. పండుగ పూట కుటుంబ సభ్యులతో గడపకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఏమైనా తీవ్రవాదులా అర్ధరాత్రి అరెస్ట్ చేయటానికి అని అన్నారు. మీడియా స్వేచ్ఛ పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటమేనని అన్నారు.

## తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు నిలయం





### • వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు

**కోదాడ,జనవరి14(నినాదం):** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు నిలయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో పాల్గొని విజయం సాధించిన మహిళలకు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగలలో సంక్రాంతి పండుగ ఒక్కటి అన్నారు. మహిళలు దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడం కోసం ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు సంస్కృతి ఉట్టి పట్టేలా సంక్రాంతి సంబరాలను జరుపుకోవడం మన సంస్కృతి సాంప్రదాయాన్ని గౌరవించడం అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలుజంపాల స్వరాజ్యం,వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర పోతయ్య, మండల కమిటీ సభ్యులు బోడ పట్ల హుస్సేన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి వినయ్, విద్యార్థి నాయకురాలు మట్టిపల్లి మానస, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కటారి పార్వతమ్మ, కుంటి గొర్ల గంగమ్మ, చిట్యాల పద్మ, జంపాల ఉప్పయ్య, అక్కెనపల్లి నాగమ్మ, బోడ పట్ల సాంబమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గంగిరెద్దుల వారికి పశుగ్రాసం కోసం ఆర్థిక సహాయం



**నల్లబెల్లి, జనవరి 14 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు గంగిశెట్టి మల్లయ్య స్మృతిగా ఆయన కుమారులు గంగిరెద్దుల వారికి పశుగ్రాసం (మేత) కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంప్రదాయ వృత్తులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ తండ్రి గంగిశెట్టి మల్లయ్య గ్రామీణ జీవన విధానం, పశుపోషణ, సంప్రదాయ వృత్తుల పట్ల విశేషమైన అభిమానాన్ని కలిగి ఉండేవారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా గంగిరెద్దుల వారికి పశుగ్రాసం కోసం తోచినంత ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గంగిరెద్దుల వృత్తి క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో ఇలాంటి సహాయ కార్యక్రమాలు ఎంతో ప్రోత్సాహకరమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వృత్తులకు గౌరవం పెరుగుతుందని, గ్రామీణ సంస్కృతి పరిరక్షణకు దోహదపడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గురువారం, తెలంగాణ
15 జనవరి 2026

నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## ట్రాఫిక్ నియమాల అమలుతోనే
# ప్రమాదాల నివారణ
### ఎస్సై ఉదయ్ కుమార్




**వెల్గటూర్,జనవరి13(నినాదం):** వాహనదారులు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్,భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందని ఎస్సై ఉదయ్ కుమార్ అన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం,పోలీస్ శాఖ చేపట్టిన 'అరైవ్ అలైవ్ణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఎస్సై ఉదయ్ కుమార్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని,హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించాలని,మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు.ప్రభుత్వ నిబంధనలు మీరితే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కార్యక్రమంలో గ్రామస్తులు,నాయకులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ కెప్టెన్ నివాసంలో..
# "బొమ్మల కొలువు"
### కృష్ణుని భాగవత కథలతో.. ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు




**జమ్మికుంట, జనవరి 14 (నినాదం):** హనుమకొండ హంటర్ రోడ్ లోని మాజీ రాజ్యసభ సభ సభ్యులు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ నివాసంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకుంటోంది. కెప్టెన్ నివాసంలో ప్రతి ఏడాది బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏటా పురాణాలు, ఇతిహాసాల్లోని కథలను వివరిస్తూ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. కెప్టెన్ సతీమణి వొడితల సరోజినీదేవి, సతీష్ కుమార్ సతీమణి డా. షమిత, కుమార్తె డా. పూజిత, కోడలు డా. శంసిత ప్రత్యేక శ్రద్ధతో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. చాలా ఏళ్లుగా వివిధ ప్రాంతాల నుండి సేకరించిన బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, మాహా భారతం, రామాయణ కథలతో బొమ్మల కొలువులు ఏర్పాటు చేయగా... ఈ సంక్రాంతికి భాగవతంలో కృష్ణుడి లీలలను, కథలను బొమ్మల కొలువుగా ఏర్పాటు చేసారు. ఇందులో భాగంగా కృష్ణుడి జననం, రాక్షస సంహారాలు, కాళీయ మర్దనం, గోవర్ధనగిరి పర్వతాన్ని కృష్ణుడు ఎత్తడం, గజేంద్ర మోక్షం, క్షీర సాగర మథనం, రుక్మిణి శ్రీకృష్ణుని కళ్యాణం, సత్యభామా పరిణయం, శ్రీకృష్ణ తులాభారం, మణిద్వీపం వంటి ఘట్టాలను బొమ్మలతో వివరించిన తీరు అందరిని కట్టిపడేస్తోంది. పిల్లలు, పెద్దలు, యువతులు, మహిళలు బొమ్మల కొలువు సందర్శించి మంత్రముగ్దులు కావడమే కాకుండా కొలువును రంగురంగుల బొమ్మలతో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దిన కుటుంబ సభ్యులను అభినందిస్తున్నారు.

**బొమ్మల కొలువు గొప్ప సంస్కృతి - భవిష్యత్తు తరాలకు అందించాలి**

సంక్రాంతి సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం గొప్ప సంస్కృతి అని, దీన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని మాజీ ఎంపీ కెప్టెన్ సతీమణి వొడితల సరోజినీదేవి, సతీష్ కుమార్ సతీమణి కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. షమిత అన్నారు. తాము ఎన్నో ఏళ్లుగా బొమ్మలను సేకరిస్తున్నామని, ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా వారం రోజుల పాటు బొమ్మల కొలువును నిర్వహిస్తున్నామని తెలిపారు. బొమ్మల కొలువులో కేవలం బొమ్మలే కాకుండా.. పురాణ కథలు తెలిపే విధంగా ఆయా ఘట్టాలను రూపొందించామని తద్వారా పురాణ కథలు పిల్లలను ఆకట్టుకోవడమే కాకుండా సులభంగా వారికి అర్థం అవుతాయన్నారు.

# గ్రామీణ ప్రాంత సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించాలి



**ధర్మపురి ప్రతినిధిజనవరి 14 (నినాదం):** మన దేశ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని నేరెళ్ల గ్రామ సర్పంచ్ కాసరపు బాలాగౌడ్ అన్నారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, కోలాటాలు, తదితర కార్యక్రమాల నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడమే కాకుండా మహిళల్లో పరోక్షంగా సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ ఐక్యతను మరింత బలపరిచేందుకే ముమ్మందు మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. గ్రామంలోని మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఈ పోటీలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో గ్రామాన్ని సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు సర్పంచ్ బాలాగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, కాసారపు కొమురయ్య వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు








**తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చేయాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వాపరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది.**

ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి. 1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు; ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.

అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదు; అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది.

ఈ నేపథ్యంలోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో - తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెలంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు.

జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు.

అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు. 1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది.

**తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో**

మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు.

**మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని**

తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి.

అలా తొలి దశ ఉద్యమం నీరు గారి పోవడం తెలిసిందే... 2001 ఏప్రిల్ 27న కేసిఆర్ నేతృత్వంలోని తెరాస ఉద్యమ పార్టీ ఏర్పాటు కావడం, సుదీర్ఘ మలి ఉద్యమ పోరాటాల, అత్మ బలిదానాల ఫలితంగా, భారత ప్రభుత్వం 2 జూన్ 2014 న తెలంగాణ నిర్మాణ దినంగా ప్రకటించడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగడం అందరికీ తెలిసిందే.

*- రామ కిష్టయ్య సంగన భట్ల,*
*సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...*
*9440595494*

# వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



- గెలిచిన వారికి బహుమతుల ప్రధానం
- సహకరించిన వాసవి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు..
- వాసవి క్లబ్ అధ్యక్షుడు గుడివాడ వెంకట సతీష్

**జమ్మికుంట, జనవరి 14 (నినాదం):** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఆఫ్ ఇయర్ లో భాగంగా జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల లో వాసవి క్లబ్ కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల సూచన మేరకు వారు ఇచ్చిన సమయంలో వారి ఇంటి ముందు రంగుల రంగవల్లులను వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. వారు వేసిన ముగ్గులను వాసవి క్లబ్ వాట్సాప్ గ్రూపులో షేర్ చేయగా వాటిని పరిశీలించిన కమిటీ సభ్యులు అత్యుత్తమంగా ముగ్గులు వేసిన ముగ్గురిని ఎన్నుకొని వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల లో పాల్గొన్న పలువురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులను కూడా అందించి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గుడివాడ వెంకట సతీష్ రేణిగుంట రాజు అయితు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని అందులో భాగంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయగా పలువురు ఉత్సాహవంతులైన మహిళలు వారి ఇంటి ముందు రంగవల్లులు వేసి బహుమతులు గెలుచు కున్నారని తెలిపారు. మొదటి బహుమతి బహుమతి గెలుచుకున్న లెంకలపల్లి రాణి రెండవ బహుమతి చిదురాల జ్యోతి మూడవ బహుమతి లెంకలపల్లి సరోజన కన్సోలేషన్ బహుమతులు యాంసాని భాగ్యలక్ష్మి, మద్ది లలిత మమత, రావికంటి జయశ్రీ, ముక్క భాగ్యశ్రీ, గర్రెపల్లి మంజుల, అయితు లత కి ఇవ్వడం జరిగిందని తెలిపారు. బహుమతులు గెలుచుకున్న వారందరికీ శుభాకాంక్షలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన రావికంటి సింధు కి, పుల్లూరి పద్మ కి (ఉపాధ్యాయురాలు), చిదురాల కవిత (గృహిణి) కు ప్రత్యేక ధన్యవాదాలు ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గుడివాడ వెంకట సతీష్ ప్రధాన కార్యదర్శి రేణికుంట రాజు ఆర్థిక కార్యదర్శి అయితు శ్రీనివాస్ వైస్ గవర్నర్ తంగళ్ళపల్లి రాజభాస్కర్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఆకినపల్లి శ్రీనివాస్ జోన్ చైర్ పర్సన్ అయితు రమేష్ జిల్లా చైర్మన్ లెంకలపల్లి శరత్ కుమార్ వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ సహాయం




**నల్లబెల్లి, జనవరి 14(నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి కేంద్రానికి చెందిన కొత్తగాట్టు పుష్ప ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న ఆమెకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 1,40,000 విలువైన చెక్కును ఈరోజు నల్లబెల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు బత్తిని మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా బత్తిని మహేష్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది పేద కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అవసర సమయంలో బాధిత కుటుంబాలకు పార్టీ నాయకులు అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి రాజు, బత్తిని మల్లయ్య, కోలా లింగయ్య, మాసంపల్లి ప్రభాకర్, కసి, గుజ్జుల బ్రహ్మ తేజతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వం, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఎమ్మెస్సార్ టిఎస్ఆర్ జయంతి వేడుకలు
### శివాలయంలో మహా అన్నదానం
### తుమ్మేటికి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



**జమ్మికుంట, జనవరి 14 (నినాదం):** దివంగత కాంగ్రెస్ నేతలు ఎం సత్యనారాయణ రావు మాజీ మంత్రి తుమ్మేటి సమ్మిరెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుల జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెస్సార్ టి ఎస్ ఆర్ జయంతి సందర్భంగా పట్టణంలోని శివాలయంలో మాజీ వార్డు సభ్యులు దిడ్డి రాము ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని గాంధీ చౌరస్తాలో టి ఎస్ ఆర్ ఎమ్ ఎస్ ఆర్ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పార్టీ కోసం పనిచేసిన మాజీమంత్రి ఎం సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జమ్మికుంట మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. పార్టీకి వారు చేసిన సేవలు వెల కట్టలేనివని వారి మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. తుమ్మిటి సమ్మిరెడ్డి మృతి చెంది సంవత్సరం గడిచిపోయిందని ఆయన లేని బాధ ఎవరు తీర్చలేనిదని అన్నారు. ఆయన పుట్టినరోజును గుర్తు చేసుకుంటూ ఆయన అభిమానులు శివాలయంలో అన్నదానం చేయడం పేదలకు పండ్లు స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూజారి రేణుక శివకుమార్ గౌడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, సాయిని రవి మాజీ మార్కెట్ డైరెక్టర్ సలీం ఎగ్గని శ్రీనివాస్ మహమ్మద్ సజ్జు మైస మహేందర్ చిన్నింటి నాగేంద్ర డాన్ రమేష్ పిడుగు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడికి చెక్.. కొత్త బోరింగ్ ఏర్పాటు



**నల్లబెల్లి, జనవరి 14 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రామతీర్థం గ్రామంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు పరిష్కారంగా సర్పంచు పొదిల వసంత, ఉపసర్పంచ్ ఎండి తహేర ఆధ్వర్యంలో కొత్త బోరింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి సమన్వయంతో చేపట్టారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, రాబోయే ఎండాకాలాన్ని ముందే అంచనా వేసి తక్షణమే బోరింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నిర్ణయంతో గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య తీరనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పందించి సకాలంలో చర్యలు తీసుకున్న సర్పంచు పొదిల వసంతకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి చర్యలు మరిన్ని చేపట్టాలని వారు ఆకాంక్షించారూ.

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం!

కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి..వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడిరది. తెలుగు రాష్టాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్ఠలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి.ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది.పంచ భూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం.ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడిరచే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపస్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

సంపాదకీయం

# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

**ఏపిలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు**
**భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు**
**ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు**
**ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి**



**హైదరాబాద్, జనవరి14(నినాదం):**

:తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు.కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటు చేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

## భోగి సంబరాలు

**భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు**
**భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు**

తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివాన్ గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత వైభవోపేతంగా భోగి సంబరాలు నిర్వహించారు. అటు ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం సొంత ఇంటి వద్ద భోగి పండుగ నేపథ్యంలో టెంకాయ, అరటి ఆకులతో ప్రత్యేక తోరణాలతో అలంకరించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పెదఅమిరంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసం వద్ద భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సభాపతి భోగి మంటలు వెలిగించారు. ఏలూరూ సమీపంలోని దుగ్గిరాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే. ఆపై భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మహా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భోగి మంటలు వేశారు. ఈ వేడుకల్లో పెద్దఎత్తున స్థానికులు పాల్గొన్నారు. ఈనెల 9 నుంచి 16 వరకు కాలేజీ గ్రౌండ్స్‌లో మహా సంక్రాంతి సంబరాలు జరుగనున్నాయి. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సెట్టింగ్స్, సాంప్రదాయ బద్ధమైన నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భోగి సంబరాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన భోగి సంబరాల్లో మంత్రి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజలతో కలిసి భోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. ప్రజలందరూ అష్ట యిశ్వర్యాలతో తులతూగాలని మంత్రి ఆకాంక్షించారు. విజయవాడలో భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. వాడ వాడలా తెల్లవారుజాము నుంచే ప్రజలు భోగి మంటలు వేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. ఎంపీ శాస్త్రోక్తంగా పూజలు చేసి భోగి మంటలు వెలిగించారు. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు గద్దె అనురాధ, బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఫొటోతో ముద్రించిన పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేశారు టీడీపీ నేతలు. గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలతో తెలుగు మహిళలు సందడి చేశారు. విజయవాడ గొల్లపూడిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆస్తి పత్రాలపై గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫొటోతో
రూపొందించిన జీవో కాపీలను స్థానిక రైతులు, మంత్రి, ఎమ్మెల్యే కలిసి భోగి మంటలలో వేసి తగలబెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రపంచమంతా గుర్తిస్తోందన్నారు. వైసీపీ నాయకులకు రాష్ట్రంలో అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటు అంటూ మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు హోంమంత్రి అనిత. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి మంత్రి నివాసం వద్ద కుటుంబ సమేతంగా భోగి వేడుకలో అనిత పాల్గొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా హోంమంత్రి నివాసం కోలాహలంగా మారింది. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా భోగి వేడుకలు నిర్వహించారు. భోగి పండుగ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరాని పండుగ అని అనిత అన్నారు. పాత కష్టాలను వదిలి.. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తూ పాలన సాగిస్తున్నారని హోం మంత్రి పేర్కొన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె భోగి మంటలు వేసి సందడి చేశారు. అనంతరం గో పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యకమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఏర్పాటు చేసిన కేరళ డప్పులను మంత్రి అనిత కొద్దిసేపు వాయించి అందరిలో ఉత్సాహం నింపారు

# భారతదేశంలో బాలికల స్థితి..

భారతదేశంలోని మొత్తం జనాభాలో మూడింట ఒక వంతు 18 సంవత్సరాల వయసు కంటే తక్కువ వయసు గల బాలబాలికలే ఉన్నారు. అంతే కాకుండా భారత దేశంలో బాల కార్మికుల సంఖ్య కూడా ఎక్కువే ఆడపిల్లల అంతస్తు చాలా తక్కువ. ప్రస్తుత సామాజిక రాజకీయ ఆర్థిక పరిసరాలలో బాలికల మనగడకే ముప్పు వాటిల్లుతుంది. దశాబ్దం నుంచి చాలా దేశాలు ప్రపంచీకరణ యొక్క ప్రభావం వల్ల ముఖ్యంగా బాలల ఆరోగ్యం, విద్య, పోషకాహార లోపం వంటి అంశాలపై అధికంగా ఉండడాన్ని గమనిస్తున్నాయి. పేదవారి జీవనం, జీవితాలను నాశనం చేస్తున్న కొత్త ఆర్థిక క్రమం పథకాలపై బాలలపై మరీ ఎక్కువగా చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రపంచంలోని భారత దేశం వంటి దేశంలో స్త్రీలు బాలికల అంతస్తు కులం వర్గం లింగ భేదం, ప్రాంతం మతం ప్రభుత్వ పథకాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి సంవత్సరం భారతదేశంలో 2.5 మిలియన్ల పిల్లలు చనిపోతున్నారు. ప్రపంచంలోని ఐదు మరణాలలో ఒకటి భారతదేశంలోనే సంభవిస్తుంది. భారతదేశంలో నవజాత శిశు మరణాల రేటు తగ్గుతున్నప్పటికీ నవజాత శిశువుల ఆరోగ్యప్రసాదాలు ఇతర దేశాల్లో కంటే భారతదేశం లోనే ఎక్కువ.

బాలికల స్థితి: భారత దేశంలో ప్రతి 11 మంది పిల్లలలో ఒకరు ఐదు సంవత్సరాల లోపు వారే ఎక్కువగా మరణిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో బరువు తక్కువగా ఉన్న శిశువులలో 35 శాతం మంది భారత దేశంలోనే జన్మిస్తున్నారు. భారతదేశంలో ప్రతి 1,000 మంది బాలురకు 927 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. ఈ నిష్పత్తి కొన్ని ప్రాంతాలలో ఇంకా తక్కువగా ఉన్నది. 65 శాతం మంది బాలికలు 18 సంవత్సరాల లోపే వివాహితులు, తల్లులవుతున్నారు. ప్రతి వందమంది బాలల్లో 19 మంది స్కూల్ కు వెళ్ళని వారై సెకండరీ స్థాయికి చేరుకునేసరికి డ్రాప్ అవుట్ రేటు 50% కంటే ఎక్కువగా ఉంది. ప్రతి వందమంది బాలికలలో 66 మంది స్కూలుకు మానేస్తున్నారు. ఇద్దరు పిల్లలు ప్రమాణం కూడా లింగమరణానికి దారి తీస్తుంది. బాలికకు ఒక పెద్ద ప్రమాదంగా మారింది. పరిశోధకులు ప్రభుత్వ పథకాలలో లోపాలు ఉన్నాయని భావిస్తున్నారు.

బాలికల విద్య: భారతదేశంలోని విద్యావ్యవస్థ బడి మానేసే వారి రేటు ఎక్కువగా ఉండడానికి కారణాలు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం. విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం. జెండర్ అసమానతలు వైకల్యం పట్ల పక్షపాత ధోరణి కుల వివక్ష విద్యా వ్యవస్థలో హంసాత్మకంగా పిల్లలను శారీరకంగా దండించడం అని చెప్పవచ్చు. దేశంలోని పిల్లలకు సరైన ఆహారం లభించ చేయడానికి భారత ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పౌరుల మౌలిక హక్కులలో ఆరోగ్యంగా బతకడం అతి ప్రధానమైనది. 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు ప్రమాణాలు భారతదేశంలోని 26 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలోని 640 నగరాలు పట్టణాలలో ప్రతి 1,000 మంది బాలలకు 904 మంది బాలికలు ఉన్నారని, 2001 జనాభా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆరు సంవత్సరాల వయస్సు సమూహంలోని వారిలో ప్రతి 1,000 మంది బాలలకు 919 మంది బాలికరే ఉండడం మురికి వాడల్లో కనపడుతుంది. పిల్లలు బాలికల అంతస్తులు మెరుగుపరచడానికి భారతదేశం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ బాలలకు సంబంధించిన ఘనాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి .

తెలంగాణలో బాలికల అంతస్తు: తెలంగాణను వెనుకబడిన రాష్ట్రంగా పేర్కొంటూ మొత్తం ఉమ్మడి పది జిల్లాలలో 9 జిల్లాలను వెనుకబడినవేనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ లో ఈ ప్రాంతాన్ని తీర్ల నిర్లక్ష్యం చేయబడింది. గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. సహజ వనరులను దోపిడీ చేయడంతో గ్రామీణ జీవనం ఎంతో నష్టపోవడమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా పురుషుల వలస పోవడానికి దారితీసింది. ఒంటరి స్త్రీ పిల్లలను పెంచడం మన సమాజంలో ఇప్పటికీ ఒక సవాలే. దీంతో పాటు బాలిక అంతస్థు కూడా ప్రభావానికి గురవుతుంది. పిల్లల పోషకాహార లోపం లో నల్గొండ వంటి జిల్లాలలో బాలికలను ఎక్కువగా బాలికలను అమ్మి వేయడం కూడా మనం గమనించవచ్చు. నల్గొండ మహబూబ్నగర్ వరంగల్ లోని వెనుకబడిన ప్రాంతాల నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి సంఖ్య ఎక్కువ. దీంతో బాలికపై మరింత భారం పెరుగుతుంది .విద్య ఆరోగ్యం ప్రైవేట్ కావడం కార్పొరేటీకరణ ఫలితంగా ఇంటిలో పని చేయడానికి ఉపయోగపడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో జోగిని, మాతమ్మ, దేవదాసులుగా దేవుని పేరిట ఆడపిల్లలను త్యాగం చేయడానికి సాంస్కృతిక కారణాలు ఉన్నాయి. మహబూబ్నగర్ నిజామాబాద్ కరీంనగర్ నల్గొండలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. జోగిని ఆచరణ అధికారికంగా నిషేధించినప్పటికీ ఇంకా కొనసాగుతుంది.

తెలంగాణలో బాలికల నిష్పత్తి: తెలంగాణలో బాలిక అంతస్తు సంతృప్తికరంగా లేకపోయినప్పటికీ లింగ నిష్పత్తి దేశం మొత్తం సరాసరి కంటే మెరుగ్గాని ఉంది .2011 జనాభా అంకాల ప్రకారం దేశం మొత్తానికి లింగ నిష్పత్తి వెయ్యిమంది పురుషులకు 943 మంది స్త్రీలే తెలంగాణలో లింగ నిష్పత్తి వెయ్యి మంది పురుషులకు 98 మంది స్త్రీలు ఉన్నారు. ఖమ్మం అదిలాబాదులో కూడా లింగ నిష్పత్తి ఎక్కువగా ఉంది. జీరో నుండి ఆరు సంవత్సరాల మధ్య వయస్సులోని బాలికల గణాంకాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 2001లో జనాభా గణాంకాల ప్రకారం లింగ నిష్పత్తి 1000 మంది బాలురకు 957 మంది బాలికలు ఉన్నారు.

బాలికల అంతస్తు పెరగడానికి ప్రభుత్వ చర్యలు: నవంబర్ 20, 1989న యూఎస్ జనరల్ అసెంబ్లీ బాలల హక్కుల కన్వెన్షన్ను ఆమోదించింది. ఆ రోజు నుండి అనగా జనవరి 26, 1990 నాడు 61 దేశాలు దానిపై సంతకాలు చేశాయి. ఈసిఆర్ సి 18 సంవత్సరాల్లోపు బాల బాలికలందరికి లింగభేదం వరద బేధం భాషా మతం జాతి అనే అంశాలతో సంబంధం లేకుండా వర్తిస్తుంది. భారతదేశంలో 1992లో సి ఆర్ సి ని అంగీకరించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం పిల్లల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలోని భాగంగా ఉన్న

## ప్రభుత్వ సంరక్షణా పథకాలు

స్త్రీల అభివృద్ధి డిపార్ట్మెంట్ స్థానంలో స్త్రీలు పిల్లలు అభివృద్ధికి ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేశారు. బాలల జాతీయ చార్టర్ 2003 బాలల జాతీయ చర్య ప్రణాళిక 2005 బాలల సంరక్షణ హక్కుల చట్టం 2006ను అమలు పరచడానికి జాతీయ కమిషన్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు బాలల జాతీయ పథకం 1974లో కూడా అమల్లో ఉంది. భారత జాతీయ చర్య ప్రణాళిక 2005ను ప్రభుత్వం ఆగస్టు 25 లో జారీ చేసింది. స్త్రీలు పిల్లలు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం భారతదేశంలోని పిల్లల దుర్వినియోగాన్ని అధ్యయన చేసి పిల్లలపట్ల నేరాలకు వ్యతిరేకంగా చట్టాన్ని తయారు చేసే ప్రక్రియలో ఉంది. బాల్య వివాహానికి సంబంధించిన ప్రోత్స చట్టాలను సవరించే ప్రక్రియను కూడా చేప ట్టింది. పార్లమెంటు ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ఆమోదించింది. ఈ బిల్లు బాల్యవివాహాన్ని ప్రోత్సహించే వారిని ఆచరణలో పెట్టే వారిని కఠినంగా శిక్షిస్తారు. బాల బాలికల బడ్జెట్ను విశ్లేషణ ప్రాముఖ్యతను గుర్తిస్తూ స్త్రీలు పిల్లల అభివృద్ధి మంత్రిత్వ శాఖ బాలల బడ్జెట్ను సంస్థలతో చేసి దాన్ని కొత్త నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఫర్ చిల్డ్రన్ 2005లో చేర్చారు. బాలల న్యాయం 2006లో సవారం బజరడమే కాకుండా దీనికి సంబంధించిన కేంద్ర నియమాలు కూడా తయారు చేశారు. ఈ విధంగా భారత దేశంలో బాలికలకు సరియైన అంతస్తుని కల్పించి వారి హోదాను పెంచుతూ బాలికా సంరక్షణ పథకాలలో హితోహికంగా సహాయం చేస్తూ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు తగిన సూచనలు చేస్తూ బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి బాలిక అంతస్తు ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వమే కాకుండా అన్ని రాష్ట్రాల సమన్వయంతో పని చేయిస్తూ బాలిక అంతస్తులు పెంచడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి అనడంలో సందేహం లేదు.

**పందిరి శ్రీనివాసులు.**
**ఎంఏ( జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజె**
**(జర్నలిజం) పిజిడిసిజే( జర్నలిజం)**

# కర్నాకటలోనూ చైనా మంజా పంజా

**బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా**
**తీవ్ర రక్త స్రావతంతో అక్కడిక్కడే మృతి**

బెంగళూరు :

చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హాళసమణిగా గుర్తించారు. హాళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరి కొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హాళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జ్గన్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి



స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

గురువారం
15 జనవరి
2026


# రంగుల హరివిల్లు.. ముగ్గుల పోటీలు..

**రోడ్డు భద్రత అవగాహనపై ముగ్గుల పోటీలు**

**అభినందించిన హుజురాబాద్ వెహికల్ ఇన్స్పెక్టర్ తనిఖీ అధికారి కంచె వేణు**



**జమ్మికుంట, జనవరి 14 (నినాదం) :** జాతీయ రోడ్డు రవాణా భద్రత మాసోత్సవ సందర్భంగా రవాణా శాఖలో హుజురాబాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించారు.వీటిని రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలలో భాగంగా లేదా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తారు, విజేతలకు బహుమతులు అందజేస్తారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు, ట్రాఫిక్ నిబంధనల పాటించడం గురించి తెలియజేయడానికి వీటిని ఉపయోగిస్తారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కంచి వేణు మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరం ముందుగా బయలుదేరి క్షేమంగా గమ్యాన్ని చేరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ వాహనాలు నడపకూడదు. ట్రాఫిక్ ను గమనించి సహనంతో దాటాలి. క్షేమముగా చేరుటకు ఏకైక మార్గం, డ్రైవర్ల తమ పక్కన ఎవరిని ఎక్కించుకోకూడదు. అతివేగం ప్రమాదకరం మలుపులు రద్దీగా ఉండే ప్రదేశాలలో వాహనాన్ని నెమ్మదిగా నడపాలి. సరియగు హారన్ ఉపయోగించాలి. రాత్రి సమయంలో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హెడ్ లైట్ డిప్ చెయ్యాలి. నిర్ధారిత స్థలంలో వాహనములను పార్కు చేయాలి. రాత్రి వేళలో వాహనాన్ని నిలిపించినప్పుడు పార్కింగ్ లేట్లు తప్పనిసరిగా వేయాలి. వాహనము నడిపేటప్పుడు పక్కవారితో సంభాషించకూడదు. వాహనము మలుపు తిరిగినప్పుడు, నిలుపుకున్నప్పుడు చేతితో సరైన సంకేతాలు ఇవ్వాలి. పరిమితి మించి మోటార్ క్యాబ్ లో ప్రయాణికులను తీసుకువెళ్లకూడదు.వాహనం నడిపేట ప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలని సూచించారు.ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. టీచర్స్ విద్యార్థులు పాల్గొంటారు, సృజనాత్మకతను ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హెూంగార్డ్ బుర్ర సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు...

## ఘనంగా కాట్రావుల పండుగ.. ఆచారాన్ని కాపాడుకుంటున్న ఆ గ్రామస్తులు



**జమ్మికుంట, జనవరి 14 (నినాదం) :** సంక్రాంతి పండుగ సందర్భంగా వ్యవసాయ బావుల వద్ద రైతులు జరుపుకునే కాట్రావుల పండుగ కనుమరుగై పోతున్న క్రమంలో హుజురాబాద్ మండలం చిన్నపాపయ్యపల్లి గ్రామంలో భోగి రోజు ఈ పండుగను గ్రామ సర్పంచ్ చల్లూరి చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పండుగను స్థానిక రైతులు ఘనంగా నిర్వఅబశ్రీశ్రీహించారు. ఎడ్లు, పశువులు కనుమరుగవుతున్న క్రమంలో ఈ గ్రామంలో ఉన్న పశువులకు కాట్రావుల పండుగ సందర్భంగా స్నానాలు చేయించి, కొమ్ము లకు జాజు పూసి, పూల దండలువేసి తోరణాల కింది నుంచి తోలారు. రైతు జీవితంతో ముడిపడి ఉన్న ఎడ్లకు ఏడాదికి ఒక సారి సంక్రాంతి సందర్భంగా వచ్చే కాట్రావుల పండుగ ఒకప్పుడు ప్రతి గ్రామంలో రైతులు ఘనంగా జరుపుకునేవారు. అప్పట్లో పశువులు, నాగటెద్దులు, పాడిగేదెలతో రైతుల కొట్టాలు కళకళలాడేవి. ఇపుడు కాట్రావుల పండుగను జరుపుకునే రైతులే కరువైన నేప థ్యంలో చిన్నపాపయ్య పల్లి గ్రామంలో ఈ ఆచారాన్ని కాపాడుతూ రైతులు ఆదర్శంగా నిలిచారు. ఇక నుండి ప్రతి ఏటా ఇలాగే కాట్రావుల పండుగను జరుపుకుంటామని స్థానిక రైతులు తెలిపారు. రైతులు ఈ సంప్రదాయిన్ని కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**అశ్వాపురం, జనవరి 14 (నినాదం):** మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ, కుమ్మరిగూడెం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల కళాత్మక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం నరసింహారావు, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, మండల కమిటీ సభ్యుడు మోకాళ్ల రమేష్, వార్డు సభ్యులు పాయం జానకమ్మ, పాయం విజయతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## 20 లీటర్ల వాటర్ క్యాన్ కేవలం 3 రూపాయలకు విక్రయం

**చింతగుర్తి గ్రామ సర్పంచ్ తమ్మినేని ప్రియాంక**

**ఖమ్మం, జనవరి 14(నినాదం):** గ్రామ ప్రజలకు 20 లీటర్ల వాటర్ క్యాన్ ను కేవలం మూడు రూపాయలకే విక్రయిస్తున్నట్లు చింతగుర్తి గ్రామ సర్పంచ్ తమ్మిని ప్రియాంక తెలిపారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాధపాలెం మండలం చింత గుర్తి గ్రామంలోనే వాటర్ ప్లాంట్ నందు. 20 లీ. వాటర్ క్యాన్ కేవలం. వాటర్ గ్రామ ప్రజలకు మూడు రూపాయలకే అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తమ్మినేని ప్రియాంక గారి చోరవ తో గ్రామంలో ఉప సర్పంచ్ పెరుపాక భరత్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తమ్మినేని నాగేశ్వరావు గారు గ్రామ శాఖ అధ్యక్షులు సూతగాని గోపయ్య. గ్రామ పెద్దలు కేతనేని సీతారామయ్య గారు. వార్డ్ మెంబర్స్ కొత్త




కొమురయ్య. పెరపక లాలు. పటాన్ ఇస్మాయిల్ ఖాన్. బొడ్డుపల్లి కొండలరావు గడదాస్ వెంకన్న. యాకుబ్ జానీ. బుచ్చాలు. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 11వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా ట్రాన్స్ జండర్స్‌కి అవకాశం ఇవ్వాలని దరఖాస్తు



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 14 (నినాదం) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 11వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణకి ట్రాన్స్ జెండర్ జరీనా బేగం దరఖాస్తును సమర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తుందని అందులో భాగంగానే ముఖ్యమంత్రి కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని నిర్ణయించారన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో నిజామాబాద్ అర్బన్ లో కార్పొరేటర్ గా అవకాశం కల్పించాలని ట్రాన్స్ జండర్ గా జరీనా బేగం దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి అవకాశం కల్పించే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ అర్చన, ఆమల, కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్, టి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లని శివ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు విద్యార్థులకు బంగారు భవిష్యత్తునిస్తాయి

**మాడే మంగయ్య**



**గుండాల, జనవరి 14 (నినాదం):** మండల కేంద్రంలో పలు గ్రామాలలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, కోకో క్రీడలు సం క్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేశారు. బుధవారం క్రీడలు కంప్లీట్ కావడంతో గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త మాడే మంగయ్య చింతలపాడు గ్రామంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారితోపాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందిం చారు.చింతలపాడు గ్రామంలో క్రీడలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు ప్రధమ ద్వితీయ బహుమతులు అందించడంతో చింతలపాడు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే దామరతోగు గ్రామంలో వాలీబాల్, కోకో క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు బంగారు భవిష్యత్తుని స్తాయని, గ్రామాలలో ఉన్నత చదువు చదువుకున్న ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని సత్తా సాటాలని అన్నారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలలో సైతం ఇలాంటి క్రీడాకారులు ఉన్నారా అని ఆశ్చర్యం కలిగిందన్నారు. యువతి యువకులు ముందు ముందు మరింత ఉత్సాహంగా క్రీడలలో పాల్గొని మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర మాజీ కమిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు

మహేశ్వరం, జనవరి 14 ( నినాదం) తెలంగాణ రాష్ట్ర మాజీ కమిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని తలకొండపల్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పడకల్ గ్రామంలో మరియు కడ్తల్ మండల కేంద్రం లో .మాడ్గుల్ మండల కేంద్రం లో అమన్ గల్ మండల కేంద్రం లో వెల్దండ మరియు కల్వకుర్తి మండలం లో .పుట్టినరోజు సందర్బంగా వివిధ మండలాల కేంద్రం లో ఆయనకు కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పెద్దలు నాయకులతో కలిసి ఆయనకు నూతన సంవత్సరం సంక్రాంతి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనతో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు పెద్దలకు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు మొదటి బహుమతి రూ. 3 వేలు, రెండవ బహుమతి పట్టుచీర రూ.2 వేలు, 5 పట్టుచీరలు






మండల టిఆర్ఎస్ నాయకులతో కలిసి బహుమతులు ఉప్పల వెంకటేష్ స్నేహితులు బంధువులు కుటుంబ సభ్యులు అభిమానుల నాయకుల చిన్నలు పెద్దలు తో కలిసి అందజేశారు.

## క్రీడలు ఐక్యతను స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**





**వనపర్తి ప్రతినిధి, జనవరి 14 (నినాదం) :** క్రీడలు ఐక్యతను స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమందడి మండలం ముందరి తాండలో బంజారా యువ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సందర్భంగా నిర్వహించే పోటీల వల్ల ప్రజల్లో ఐక్యత, ఆత్మస్థైర్యం, స్నేహ సంభంధాలు పెరిగి సమాజంలో సుఖసంతోషాలు కలుగుతాయని అన్నారు. ఓటమి, గెలుపులు సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని నింపాలని ఆయన ఆకాంక్షించారు.మాజీ మంత్రి వెంట గ్రామ సర్పంచ్ మానెమ్మ చిన్నా నాయక్, ఉప సర్పంచ్ జగదీశ్, మాజీ ఉప సర్పంచ్ రమేష్ నాయక్, గోపాల్ నాయక్, జగన్, సూర్య, మహేష్, కిషన్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

**దుదియాతండా సర్పంచ్ బానోత్ రమేష్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు**



**కొత్తగూడెం, జనవరి14 (నినాదం) :** దుదియాతండా గ్రామ సర్పంచ్ బానోత్ రమేష్ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మన గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తూ, రైతు కష్టానికి ఫలితం ఇచ్చే మహత్తర పండుగ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ రమేష్ మాట్లాడుతూ.. దుదియాతండా గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో ఉండాలని, గ్రామం సర్వతో ముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పెద్దల ఆశీస్సులు, యువత ఉత్సాహంతో గ్రామాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఐక్యతే గ్రామ బలమని, అంద రూ కలిసికట్టుగా ఉంటే ఏ అభివృద్ధి పనైనా సాధ్యమని తెలిపారు. సంక్రాంతి పండుగ దుదియాతండా గ్రామానికి కొత్త ఆశలు, కొత్త ఉత్సాహం తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శుభాకాంక్షల కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ నరేష్, మూ న్యాతండా (దుదియాతండా పంచాయతీ)కి చెందిన భూక్యా బాబురావు కూడా పాల్గొని గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## చైనా మాంజా విక్రేతలపై హత్యాయత్నం కేసులు

**ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ**

**చైనా మాంజా స్వాధీనం**

నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 14 (నినాదం) : చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరి అరెస్టు చేయగా మరొకరు పరారీ అయ్యారని వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు 2వ టౌన్ ఎస్ హెచ్ ఓ ముజాహిద్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చైనా మాంజా విక్రయిస్తున్నారనే అందిన సమాచారం మేరకు పోలీసులు రెండు టీంలుగా విడిపోయి దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పోస్టాఫీసు వెనుక సుల్తాన్ షోరూం వద్ద పతంగుల దుకాణం వద్ద ఒక వ్యక్తి సయ్యద్ అస్లాం 18 మాంజా చుట్టలు తన బైక్ టీ ఎస్ 16 ఈ పి 8342. లో పెట్టుకుని వెళు ండగా పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అతని యజమాని ఫహీం అన్సారీ, ఇద్దరి పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఫహీం అన్సారీ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.




ప్రజలకు, పక్షులకు ప్రాణాంతకమైన నిషేధించబడ్డ చైనా మాంజా ఎవరూ ఉపయోగించుకూడదనీ, చైనా మాంజా విక్రేతలపై కఠిన చర్యలు తప్పవని ఎస్ హెచ్ వో హెచ్చరించారు. చైనా మాంజా విక్రయితలను పట్టుకోవడంలో హెడ్ కాన్స్టేబుల్ రాములు, కానిస్టేబుల్ సాయి కిరణ్, నవీన్, భరద్వాజ పాల్గొన్నారు.ఖ

## వీరభద్రస్వామికి కుమ్మరుల వీర బోనం

**ఆకట్టుకున్న విన్యాసాలు**



**భీమదేవరపల్లి, జనవరి 14 (నినాదం):** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు భక్తుల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. జాతరలో భాగంగా భోగి పండగను పురస్కరించుకొని ఆలయ అర్చకులు అరుణ యంత్ర పారాయణ చేసి చండీ హెూమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం కడిపికొండ, దామెర ప్రాంతాలకు చెందిన శాలివాహనులు (కుమ్మరులు) స్వామివారికి వీర భోనం సమర్పించారు. నృత్యాలు, విన్యాసాలతో ఊరేగింపుగా సాగిన వీర బోనం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ వేషధారణ, తాళాల నాదం, భక్తుల జయజయధ్వానాలు జాతర వాతావరణాన్ని మరింత పావనంగా మార్చాయి. బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీ వీరభద్ర స్వామిని దర్శిస్తే సకల బాధలు తొలగి కుటుంబాలకు శుభఫలితాలు కలుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. స్వామివారి కృపతో భక్తుల కోరికలు నెరవేరుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ మరియు వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత, ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో పి. కిషన్ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## గోదాదేవి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ,జనవరి14,(నినాదం):** కోదాడ పట్టణంలోని కేఎల్ఆర్ కాలనీలో బుధవారం ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన గోదాదేవి కళ్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వామి వారిని దర్శించుకొని వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పవిత్ర హృదయంతో శ్రీరంగనాథుడిని నిత్య పూలమాలతో పూజించి, స్వామివారికే తన జీవితాన్ని అర్పించిన మహా భక్తురాలు గోదాదేవి అని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.ప్రతి ఒక్కరు సొంత ప్రయోజనాలతో పాటు సామాజిక సేవాకార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు..



గురువారం, తెలంగాణ
15 జనవరి 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

### చైనా మాంజా వాడకాన్ని
# ప్రజలే నిషేధించాలి

### సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్



**మహేశ్వరం జనవరి 14 (నినాదం):** చైనా మాంజా వాడకం చాలా ప్రమాదకరమని, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మైసిగండి సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్ నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా చైనా మాంజా వాడకాన్ని ప్రజలే నిషేధించాలని కోరారు. ముఖ్యం గా ప్రతి ఊర్లో, జంట నగరాల్లో విస్తృతంగా అమ్మకాలు జరుపుతున్నారని, అక్రమంగా చైనా మాంజా త యారు చేసేవారిపై అదేవిధంగా అమ్మే వారిపై కేసులు నమోదు చేసినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతున్నా యని, శాంతి భద్రత పరిరక్షణ పోలీసులను సహకరిస్తూ, పకడ్బంధీగా అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారని సూచించారు. మంజా వాడకంపై మానవ హక్కుల సంఘానికి ఓ సంస్థ తరపున ఫిర్యాదు చేశారని, పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేస్తూ కోర్టు ఆదేశించినట్లు ఆయన గుర్తు చేశారు. గాలి పటాలను ఎగరేసేందుకు పెద్దలు, పిల్లలు, యువతీయువకులు ప్రత్యామ్నాయ మార్గాల్ని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెంకటేశ్వర్ రెడ్డి అనే ఆర్మీ జవాను లంగర్ హౌస్ ఫ్లైఓవర్మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో చైనా మాంజా గొంతుకు తగిలి కోసుకుపోయి మృత్యువాత పడ్డాడని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లపై నుంచి ఎగిరే పక్షులు సైతం చైనా మాంజాకు చనిపోతున్నాయనిఅన్నారు. కాలిబాటన రోడ్డుపై నడిచే పాదాచారులు ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. చైనా మాంజాను గాజు ముక్కల తోపాటు రసాయనాలు కలుపి తయారు చేయడం వల్ల ప్రమా దకరంగా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతిరోజు మీడియా పోలీస్ స్టేషన్లో కేసులు నమోదైనప్పటికీ,చైనా మాంజ కొనుగోలు చేసేవారు, అమ్మేవారు చట్టాన్ని అతిక్రమిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసు అధికారులు కఠినంగా చేపట్టారని సూచించారు. చైనామాంజపై పిల్లలు, పెద్దలు, యువతీయువకులకు పోలీసులు అవగాహన కల్పించాలని ఆయన విన్నవించారు. ప్రాణంపోయిన వారి ప్రాణాల్ని తిరిగితీసుకురాలేమని, ప్రజల ప్రాణాలు కాపాడేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంక్రాంతి పండుగ పూట అన్ని కుటుంబాలు సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# సమస్యలపై పోరాటం.. పరిష్కారమే.. సిపిఐ ధ్యేయం





- వందేళ్ల స్ఫూర్తితో బలమైన ఉద్యమాలు
- సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి
- ఖమ్మంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ
- మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం, జనవరి14(నినాదం):** సిపిఐ శత వసంతాల సాక్షిగా సమస్యలపై పోరాటం, వాటి పరిష్కారమే ధ్యేయంగా మరో వందేళ్లు కూడా ముందుకు సాగుదామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ కార్యదర్శులు, పట్టణ కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ల అత్యవసర సమావేశం స్థానిక శేషగిరి భవన్, సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ దేశ స్వతంత్రానికంటే ముందే భారత గడ్డపై ఆవిర్భవించిన సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. బ్రిటీష్ బానిస సంకెళ్ల నుండి దేశాన్ని విముక్తి చేసేందుకు సిపిఐ రాజీలేని పోరాటం చేసిందని, ఈ మహా సంగ్రామంలో ఎందరో కమ్యూనిస్టు యువకిశోరాలు రక్త తర్పణం చేశారని చెప్పారు. భూమి కోసం భుక్తి కోసం నిరంకుశ నిజాంను గద్దెదింపేందుకు జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నరవేల మంది ప్రాణ త్యాగాలు చేశారని, వేలాది గ్రామాలు విముక్తి పొందగా, పది వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐకు ఉందని, అదే విధంగా తెలంగాణ మలిదశ పోరాటంలో సిపిఐ పెద్దన్న పాత్ర పోషించిందన్నారు. నాటి నుండి నేటి వరకు అదే పోరాట పటిమతో సిపిఐ వందేళ్లుగా ముందుకు సాగుతోందని, రానున్న శత వసంతం కూడా ప్రజలు, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉత్తేజ పూరితంగా ముందడుగు వేద్దామన్నారు. దేశంలో అధికారాన్ని అనుభవిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కషాయికరణ వైపు వేగంగా అడుగులేస్తోందని, హిందుత్వ ఎజెండాతోముందుకు సాగుతూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటోందన్నారు. మోడి సర్కార్ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ దేశ సంపదను కారు చౌకగా అదానీ, అంబానీ లాంటి కార్పోరేట్ దారుల చేతుల్లో పెడుతూ దేశాన్ని పేదరికం వైపుకు పరుగులు తీయిస్తోందన్నారు. సింగరేణిని ప్రైవేటీ కరణ చేసేందుకు చూస్తోందని, బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టి దశాబ్దాల చరిత్ర గల సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు చూస్తోందని మండిపడ్డారు. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజానికాన్ని కట్టుబానిసలుగా మార్చేందుకు చూస్తున్న బిజేపి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, ఇందు కోసం కమ్యూనిస్టులు ఐఖ్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐఖ్యత అనివార్యమని చెప్పారు. ఈనెల 18న ఉద్యమాల పురిటిగడ్డ ఖమ్మం కేంద్రంగా సిపిఐ శత వంసత ఉత్సవాల ముగింపు సభ ఐదు లక్షల మందితో వైభవంగా జరగనుందని, 40 దేశాల నుండి కమ్యూనిస్టు ప్రతినిధులు తరలి వస్తున్నారని చెప్పారు. కమ్యూనిస్టులకు పస తగ్గిందంటూ నోళ్లు పారేసుకుంటున్న వారికి కనీవినీ ఎరుగని రీతిలో జరిగే ఈ శత వసంత సభ కనువిప్పు కానుందని, ఈ సభను విజయవంతం చేసేందుకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. త్వరలో కార్పోరేషన్ ఎన్నికలు జరగనున్నాయని, నూతనంగా ఏర్పాటైన కొత్తగూడెం కార్పోరేషన్కు జరిగే ఎన్నికల్లో సిపిఐ విజయం సాధించేందుకు ఆయా డివిజన్ల కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు ఇప్పటి నుండే కృషి చేయాలని, ప్రజలతో మమేకమై చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, గెలుపై లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ ఎన్నికల్లో స్థానిక పరిస్థితులు, స్థితిగతుల = దృష్ట్యా కలిసివచ్చే వారితో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జిల్లా కార్యవర్గసభ్యులు కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణా చారి, బండి నర్సింహా, గుమ్మడెల్లి దుర్గ, పల్లపోతు సాయి కుమార్, పైడిపెల్లి లక్ష్మీ, కైసర్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహా అన్నప్రసాద వితరణ మొదటిరోజు సక్సెస్





**సంక్రాంతి, కనుమ ప్రత్యేకం**
**కొత్తకొండ జాతర భక్తులకు ఆహ్వానం**
**త్రికూటేశ్వరుని దర్శనంతో పుణ్యఫలం**

**భీమదేవరపల్లి జనవరి 14 (నినాదం);** ముత్తారం గ్రామంలో ఉన్న త్రికూటేశ్వర ఆలయంలో నిర్వహించిన తొలి రోజు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో 500కు పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి మరియు కనుమ పర్వదినాల సందర్భంగా కూడా మహా అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మ. 12 గం.ల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు అన్నప్రసాదం సమయాన్ని పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ జాతరకు వచ్చే భక్తులు తప్పకుండా ముత్తారం త్రికూటేశ్వర ఆలయాన్ని దర్శించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ త్రికూటేశ్వరుని దర్శించుకోవడంతో పాటు, బ్రహ్మసూత్రం గల శివలింగాన్ని దర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు కీలక పాత్ర పోషించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి మరియు శుభ్రత చర్యలు సముచితంగా ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది.

# హస్తకళ నైపుణ్యానికి నిదర్శనం ముగ్గుల పోటీలు
## -సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 14 (నినాదం)** మహిళల సృజనాత్మకతకు, హస్తకళనైపుణ్యానికి ముగ్గుల పోటీలు నిదర్శనమని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్అన్నారు.బుధవారం పెద్దమందడి మండలంమణిగిల్ల గ్రామంలో గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ పెద్దఅనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోభోగి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలునిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మహిళలు అధిక సంఖ్యలోపాల్గొని ఉత్సవంగా ముగ్గులు వేశారు. తరతరాల నుంచి వస్తున్న సంక్రాంతిపండుగను కండ్లకు కట్టినట్లు ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు.ఈముగ్గుల పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ లో మొదటి బహుమతి. రెండో బహుమతి,మూడవ బహుమతులు గెలుపొందిన మహిళలకు మకర సంక్రాంతి రోజున ఇవ్వడంజరుగుతుందని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామఉప సర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్, ఎస్. రాములు, పోతుల రామ్ రెడ్డి,పోతుల ప్రతాప్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి రాజు, గొందిరామకృష్ణారెడ్డి, పలుస శేఖర్ గౌడ్, పలుస సంఘమేశ్వర్ గౌడ్, సుంచర్ మోనివెంకటయ్య, మండల దశరథం, బోయిని కృష్ణయ్య, ఆనంద్ కుమార్ రెడ్డి, కావలి శివశంకర్, ప్రేమ్ కుమార్



రెడ్డి, ఉప్పరి రాఘవేంద్ర, బోయిని గణేష్, సుంచర్మోని అశోక్, గొల్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, అనిల్ కుమార్ రెడ్డికిగ్రామస్తులు అభినందించారు.

# శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి
### పుటాని తండాలో విస్తృత ప్రచారం
### సిపిఐ నాయకులు బానోతు నాగేశ్వరరావు



ఖమ్మం, జనవరి 14(నినాదం): ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాధపాలెం మండలం పుటానీ తండ గ్రామపంచాయతీలో సిపిఐ 100వ శతాబ్ది ఉత్సాహాలను గ్రామ ప్రజలు సిపిఐ సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ పోస్టర్లతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ... పుటాని తండలో సిపిఐ సానుభూతిపరులు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ప్రజలను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి అనేక ఉద్యమాలు రైతులు, కార్మికులు కోసం పోరాటాలు చేసిందని వారు తెలియజేశారు. ఆరోజున బైక్ ర్యాలీతో వచ్చే వారు ముందుగా సంప్రదించాలని ఆయన కోరారు. ఈనెల 18న ఖమ్మంలోని ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలను హాజరు కావాలని సభను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బానోత్ కిషన్, బానోతు లక్మా, బానోతు లక్ష్మ, నునావత్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్స్ మహేష్ బాబు అభిమాన సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**కొత్తగూడెం, జనవరి14(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రిన్స్ మహేష్ బాబు అభి మాన సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం అబి మాన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, అలాగే పట్టణ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కొదుమూరి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దారా నగేష్ క్యాలెండర్ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మహేష్ బాబు అభిమాన సంఘం సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు సాయిబాబా, కూర ప్రసాద్, రావికంటి మనోహర్, దారా కిరణ్, అయితా ప్రవీణ్, గర్మి చిన్న, కొయ్యడ నగేష్, ప్రసాద్, రామ్ రాజ్ కిరణ్, నరేంద్రుల రిషి కుమార్, సుగ్గల సునీల్, డి.ఎస్.ఎస్.వి.ఎం.కె బాబు (దారా శ్రీనివాస్) తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

# ఘనంగా ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు







### మహిళలకు ముగ్గుల పోటీలు
### పట్టు చీరలు అందజేత

**కల్వకుర్తి, జనవరి 14 (నినాదం) :** మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ పుట్టినరోజు వేడుకలను కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ప్రజా నాయకుడు ఉప్పల వెంకటేష్ జన్మదిన సందర్భంగా తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని స్వామివారి అనుగ్రహం పొందారు. అనంతరం పడకల్ గ్రామంలో కడ్తాల్, మాడ్గుల్, అమనగల్, వెల్దండ,కల్వకుర్తి మండల కేంద్రాలలో బిఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటేష్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పాల్గొన్ని కార్యకర్త సమక్షంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలలు పంచుకొని పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అదేవిదంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు నగదు బహుమతుల తో పాటు పట్టు చీరలను అందచేశారు. మొదటి బహుమతి రూ: 3000, పట్టుచీర. రెండవ బహుమతి రూ: 2000, పట్టుచీర, అలాగే ఐదు మంది మహిళలకు కన్సలేషన్ ప్రైజులు, పట్టు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు మన సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకొని భవిష్యత్ తరాలకు సాంప్రదాయాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నారక్కపేటలో మహిళల ముగ్గుల పోటీలు
### విజేతలకు ఘనంగా బహుమతుల ప్రదానం





**నల్లబెల్లి,జనవరి 14 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోసంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మండలంలోని నారక్కపేట గ్రామంలో మహిళల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు తమ ప్రతిభను ప్రదర్శించారు.పోటీల విజేతలకు బుధవారం గ్రామ సర్పంచ్ దండెం సంపత్ అధ్యక్షతన నిర్వహించిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను,వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పండుగల వేళ సంప్రదాయాలను కాపాడుకుంటూ మహిళలకు ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయమని సర్పంచ్ సంపత్ పేర్కొన్నారు.ఈ పోటీల్లో ఈర్ల అఖిత ప్రథమ బహుమతి, దండెం నికిత ద్వితీయ బహుమతి, మేకల అస్మిత తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. గుండెకారి తన్మిత, శనిగరం అర్చన, దండెం శిరీషలకు కన్సాలేషన్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం, ఉపసర్పంచ్ సూరబోయిన రాంబాబు, మాజీ ఎంపీటీసీ గుండాల రాజ కొంరయ్య, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు తిప్పారపు రాంబాబు, వక్కల సంతోష్, కాగితపు రాజేంద్రచారి, పోగుల పైడి, కన్నూరి రమేష్, మిడిదొడ్డి శ్రీను, యాపశెట్టి రమేష్, కదిరిక మొగిలి, మెరుగు రాజేందర్, యూత్ అధ్యక్షుడు మొట్టె గణేశ్, కార్యదర్శి తిప్పారపు నాగరాజు, అలాగే జగన, మహేష్, సురేష్, దయాకర్, మనోజ్, ప్రదీప్, కుమార్తో పాటు అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గంగాపూర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నినాదం, బుగ్గారం : బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో బుధవారం నాడు గంగాపూర్ క్రికెట్ టోర్నమెంట్ గ్రామ సర్పంచ్ రాయిల్ల శ్రీనివాస్ టాస్ వేసి ఆట ప్రారంభం చేశారు .గెలిచిన విజేతలకు మొదటి బహుమతిగా 5016, రెండో విజేతకు 3016, మూడో విజేతకు 2016. ఈ సందర్భంగా సర్పంచ్ రాయిల్ల శ్రీనివాస్ సంక్రాంతి పండుగ వేళ విద్యార్థులు యువత క్రీడల్లో అభివృద్ధి పెంచుకోవాలని ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రపు తిరుపతి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రంగవల్లుల పోటీలు
### గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానం
### పాల్గొన్న మంత్రి సతీమణి



**నినాదం, బుగ్గారం :** బుగ్గారం మండలం సిరికొండ గ్రామంలో బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు సర్పంచ్ పంచిత ధర్మరాజు అద్వర్యంలో గ్రామ పంచాయితీ ఆవరణంలో నూతన పాలకవర్గం సభ్యులు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమ ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతిమణి కాంతకుమారి విచ్చేశారు.ప్రథమ, ద్వితీయ,తృతీయ, బహుమతులతోపాటు పాల్గొన మహిళ లకు జ్ఞాపికలు ప్రధానం చేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో ICDS ధర్మపురి ప్రాజెక్టు CDPO వాణిశ్రీ, బుగ్గారం మండల ICDS సూపర్వైజర్ నీలిమ,ఉప సర్పంచ్,వార్డు మెంబర్స్, మహిళలు,అంగన్వాడీ టీచర్స్,ఆశ వర్కర్లు, మహిళ సంఘాల సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

గురువారం, తెలంగాణ
15 జనవరి 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## ఘనంగా ముగ్గుల పోటీలు



**సిద్దిపేట దుబ్బాక (నినాదం):** సంక్రాంతి పండగ పురస్కరించుకొని తొగుట మండలం వెంకట్రావుపేట్‌లో వేణుగోపాల స్వామి ఆలయం కమిటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది రాజు ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.గ్రామం లోని మహిళలు ఉత్సా హంగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అందరూ పండుగ శోభ ఉట్టిపడేలా అందమైన రంగవల్లులతో ఆకర్షణీయంగా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు.ప్రథమ బహుమతి జీడిపల్లి అనూష,ద్వితీయ బహుమతి వేముల లక్ష్మి ప్రసన్న,తృతీయ బహుమతి కొక్కొండ నాగలక్ష్మి ,ప్రకృతి పరిరక్షణ సందేశానికి గాను పాల భవానికి ప్రత్యేక బహుమతి ఇవ్వడం జరిగింది.పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో పంది రాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు వేణుగోపాల స్వామి ఆలయానికి,ఆధ్యాత్మిక కార్యక్రమాలు అన్నిటికి సహకరిస్తానని అన్నారు.ఆలయ మహిళా కమిటీ చైర్మన్ రాయరావు అరుణ,మహిళా కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజ్జనబోయిన అనిల్ ,బెజ్జనబోయిన రాములు, కల్లేపు భాను చందర్,బేజ్జనబోయిన ప్రవీణ్, ఎర్రోళ్ల అర్జున్, కల్లేపు నరేష్ పోతరాజు రవీందర్ ,కొయ్యడ స్వామి చరణ్,మిద్దె సంతోష్, పంది వెంకట్ సుతారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గోనే సల్మన్ రాజుకు నామినేట్ పదవి ఇవ్వాలి
### అన్ని క్రైస్తవ సంఘం డిమాండ్

**సిద్దిపేట దుబ్బాక (నినాదం):** రాష్ట్రంలో 119 నియోజవర్గంలో క్రిస్టియన్ సమాజం గోనే సాల్మన్ రాజుకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవుల కోసం ఆయన జీవితం అంకితం చేసిన వ్యక్తిని గత 30 సంవత్సరాల నుండి క్రైస్తవ సమాజం చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో మొదటి వ్యక్తి గోనే అని ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గం క్రైస్తవులు గుర్తు చేశారు. ఇప్పటికే ఎన్నో పదవులు చేపట్టాల్సిన వృత్తి కానీ ఆయన పదవుల కోసం కాక ప్రజల కోసం పనిచేస్తున్నారు. కావున ఆయన సేవలు క్రైస్తవ సమాజం మర్చిపోలేదని క్రైస్తవ సమాజం కోటి జనాభా ఉన్న మేము మాకు నాయకత్వం నాయకుడు లేడు కావున మా తరపున సమాజం తరపున పోరాటం చేయడానికి సమస్యలను పరిష్కరించడానికి మా నాయకుడు సల్మన్ రాజుకు వెంటనే చైర్మన్ పదవి ఇవ్వాలని దుబ్బాక నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలకపాత్ర పోషించిన సల్మన్ రాజుకు వెంటనే చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దుబ్బాక నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రెసిడెంట్ పాస్టర్ సత్యం ,పాస్టర్ దినకర్ ,పాస్టర్ ప్రభుదాస్ పాస్టర్ తిమోతి ,పాస్టర్ జీవన్ రాజ్ పాస్టర్ గిధ్యోను,పాస్టర్ మార్క్ ,పాస్టర్ నవీన్ మరియు తదితరులు పాల్గొన్నారు

## లింగాపూర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనవరి 14 (నినాదం):** రామగుండం నగరపాలక సంస్థ 29వ డివిజన్లో లింగాపూర్ లో ఈ నెలలో మృతిచెందిన కొన్ని కుటుంబాలను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన కందుల తిరుపతి-స్రవంతి దంపతులు, ఆడెపు శ్రీకాంత్ కుటుంబం, ప్రమాదంలో మృతి చెందిన సిరిపురం అఖిల్, నగనూరి లక్ష్మి కుటుంబాలను ఆయన పరామర్శించి ధైర్యం పంచారు.ఈ సందర్భంగా నారాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, ఆర్షనపల్లి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, కందుల సత్తయ్య, ఆర్షణపల్లి రాజు, నిమ్మరాజుల రవి, ఆర్షనపల్లి శ్రీకాంత్, జాపతి ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## చిన్న నాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వనపర్తి ప్రతినిధి, జనవరి 14 (నినాదం) :** చిన్నంబాయి మండలం చిన్నమారు గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితుడు తిరుమల వాస రెడ్డి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి బుధవారం వనపర్తి, హైదరాబాద్, విదేశాలలో ఉన్న స్నేహితులు వారి పిల్లల చదువుల కొరకు ఒక లక్ష అరవై ఐదు వేల రూపాయలు అతని కుటుంబ సభ్యులకు అందచేశారు. రాబోయే రోజుల్లోపిల్లలకు పైచదువుల కొరకు తమవంతు సహాయ సహకారం ఎల్లపుడు అందిస్తామని చెప్పారు. సహాయం చేసిన వారిలో వనపర్తి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, జయపాల్ రెడ్డి, గట్టు వెంకన్న, పెద్దమందడి మండలం బీఆర్ఎస్ నాయకుడు విట్టా శశి వర్ధన్ రెడ్డి, డిసిసిబి మేనేజర్ సత్యప్రకాష్ రెడ్డి, వెంకట్ రమణ, సతీష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, కొండా రాము, మేఘా శ్యామ్ రెడ్డి లు ఉన్నారు

# జర్నలిస్టు ల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం

### ప్రజాపాలన అంటే జర్నలిస్టులను అరెస్ట్ చేయడమా...
### టియుడబ్ల్యూ జే (ఐజేయు) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కె. రంగాచార్య

**సిద్దిపేట (నినాదం):** చీఎ జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణాచారి, సుధీర్, మహిళా జర్నలిస్టు ల అక్రమ అరెస్ట్ ను ఝఔజీ (×జీఖ ) సిద్దిపేట జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నది అన్నారు.టియుడబ్ల్యూ జే( ఐజేయు) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కె. రంగాచార్య ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యూస్ ఛానల్ లో వచ్చిన ఒక వార్తకు వీరిని బాధ్యులను చేస్తూ అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికం.. గత ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీ గా హక్కుల పరిరక్షణ.. స్వేచ్ఛ అనే అంశాలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు..ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడం లో విఫలం అయిన రేవంత్ రెడ్డి ఏడో గ్యారెంటీ గా ఇచ్చిన హక్కుల పరిరక్షణ హామీని కూడా విస్మరించాడు. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా.. సోషల్మీడియా లో పోస్ట్ పెట్టినా.. ముఖ్యమంత్రి వైఖరిని ఎవరు వ్యతిరేకించినా.. మాట్లాడినా వారిని అరెస్ట్ చేయడం.. అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడం.. అధికార పార్టీ నాయకులు దాడులు చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడడం సర్వ సాధారణ విషయంగా మారిపోయింది.. తాజాగా చీఎ లో ఒక వార్త ప్రసారం చేశారనే కారణం తో ఆఛానల్ ఇన్ పుట్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు దొంతు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ పరిపూర్ణ చారి.. సుధీర్.. మరో మహిళా జర్నలిస్టును అప్రజాస్వామికంగా అరెస్ట్ చేశారు.. దొంతు రమేష్ తన కుటుంబం తో కలిసి బ్యాంకాక్ వెళ్ళడానికి ఎయిర్ పోర్ట్ కు వెళ్లిన క్రమంలో పోలీసులు ఎయిర్ పోర్టు కు వెళ్లి ఒక క్రిమినల్ ను అరెస్ట్ చేసిన విధంగా ఆయనను అరెస్ట్ చేశారు... మిగతా జర్నలిస్టులను వారి ఇంటికి అర్ధరాత్రి వెళ్లి ఇంటి తలుపులను ధ్వంసం చేసి తీవ్రవాదుల మాదిరి అరెస్టు చేశారు.. ఒక వార్త ప్రసారం చేశారనే కారణంగా వాస్తవాలు తెలుసుకోకుండా జర్నలిస్టు లను ఇలా అరెస్టు చేయవచ్చా.. ప్రజా పాలన అంటే ఇదేనా...? ప్రజా ప్రభుత్వం అంటే ఇట్లానే ఉంటుందా..?వార్త తప్పు అని భావిస్తే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు. ఇతర ప్రజాస్వామిక పద్ధతులను అవలభించవచ్చు. జర్నలిస్టు సంఘాల దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చు. వార్త ప్రసారం చేసిన చీఎ యాజమాన్యం, ఎడిటర్ కూడా ఆవార్త ప్రసారం పట్ల క్షమాపణ కోరింది.. అయినా ప్రభుత్వ పెద్దలు ఉద్దేశ్యపూర్వకంగా వారిని సమయం కాని సమయంలో అరెస్టు చేయడం.. పండుగ అని కూడా చూడకుండా పోలీస్ స్టేషన్ కు తరలించడం పోలీసుల దౌర్జన్య చర్యకు నిదర్శనం. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి తోనే ఈ అరెస్టు లు జరిగినట్టు తెలుస్తోంది. ఇది పూర్తిగా భావ ప్రకటనా స్వేచ్ఛ పై.. మీడియా స్వాతంత్ర్యం పై.. పత్రికా స్వేచ్ఛ పై జరిగినదాడి గానే భావించాల్సి వస్తుంది..ఈ అక్రమ అరెస్టు ను ఝఔజీ (×జీఖ ) తీవ్రంగా ఖండిస్తున్నది.. అరెస్టు చేసిన జర్నలిస్టు లను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.. వారిపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. అన్నారు .

## అన్నపూర్ణ అయ్యప్ప క్షేత్రంలో మకర జ్యోతి వేడుకలు
### అభిషేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్





**నిర్మల్ ప్రతినిధి,(భైంసా) జనవరి 14.(నినాదం):** భైంసా పట్టణం లోని అన్నపూర్ణ అయ్యప్ప క్షేత్రంలో మకర జ్యోతి దర్శన వేడుకలు వైభవోపేతంగా జరి గాయి. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ స్వామి వారికి అభిషేకం చేశారు.. స్వాముల పాటలతో అశేష జనం మధ్య ఆలయ పరిసర ప్రాంతం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి సి. సి రోడు నిర్మాణం చేపట్టినందుకు ఎమ్మెల్యే కు ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ కృతజ్ఞతలు తెలిపారు..అదే విధం గా ఆలయం లో మకర జ్యోతిని దర్శించుకోవడంతో శబరిమలైలో జ్యోతి దర్శనాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా విక్షించారు.

## రెడ్డి యువజన సంఘం పాలకవర్గం ఎన్నిక

సిద్దిపేట జనవరి 14,(నినాదం ):సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో రెడ్డి యువజన సంఘం పాలకవర్గాన్ని నూతనంగా ఎన్నుకోవడం జరిగిందని సంఘం అధ్యక్షుడు కూరెల్లి అశోక్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో రెడ్డిల సమస్యలపై పోరాడడానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని, అధ్యక్షుడిగా తన ఎన్నిక తో పాటు ఉపాధ్యక్షుడిగా ఐరని సురేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెంద్యాల తిరుపతిరెడ్డి, కోశాధికారి కస్తూరి హరికృష్ణ రెడ్డి, కార్యదర్శి ఇర్రి వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చిటుకుల అనిల్ రెడ్డి, గడ్డం నవీన్ రెడ్డి, జక్కిరెడ్డి నాగరాజు రెడ్డి, గడ్డం విజయ రెడ్డి, చిలుకోటి రాజిరెడ్డి, ఇర్రి మహిపాల్ రెడ్డి లు ఎన్నికయ్యారు.

## కుటుంబ సభ్యులతో స్వామివారికి ప్రత్యేక పూజలు
### ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు యాట నరసింహ



**మహేశ్వరం, జనవరి 14 (నినాదం) :** స్వామివారికి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు, నూతన సంవత్సరం సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగతో గ్రామాల్లో కళకళ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని ప్రజలకు ప్రజాప్రతినిధులు, నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ రైతుల పండుగగా పేరుగాంచిందని, కష్టపడి పంటలు పండించిన రైతులకు ఈ పండుగ ఆనందాన్ని నింపుతుందని వారు పేర్కొన్నారు.సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటా ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకేచోట చేరి పండుగను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ప్రజల మధ్య ఐక్యత, సాంప్రదాయాలను పెంపొందించే పండుగ అని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అలాగే రైతులు పండించిన పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పట్టణాలు గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వం ధ్యేయం







**ఇందిరమ్మ ఇల్లు లాంటి అద్భుత పథకం దేశంలో ఎక్కడా లేదు**
**రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**పట్టణాలు గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన పండగ**
**రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**
**వనపర్తి పెబ్బేరు కొత్తకోట పట్టణాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రులు**



**వనపర్తి ప్రతినిధి, జనవరి 14 (నినాదం):** ప్రజా సంక్షేమంతో పాటు పట్టణాలు,గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రికోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తన సహచర మంత్రి రాష్ట్ర పశు సవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి వనపర్తి జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. కొత్తకోట, పెబ్బేరు, వనపర్తి పట్టణాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. అదేవిధంగా పలు పూర్తి అయిన అభి వృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరితోపాటు రాష్ట్రప్ర ణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యేజి. మధు సూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలో వివిధఅభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో రూ.72 కోట్ల వ్యయంతోనిర్మించిన నూతన బాలుర, బాలికల వసతి గృహాలు, కిచెన్, డైనింగ్ హాల్ నుప్రారంభించారు. రూ.5 కోట్లతో నిర్మించనున్న జేఎన్టీయూ క్లాస్ రూమ్‌కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో వనపర్తి పట్టణంలోనిమరికుంటలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో డార్మెటరీ, డైనింగ్ హాల్ నిర్మాణం పనులకు, రూ.1.50 కోట్లతో అదే పాఠశాలలో స్టాఫ్ క్వార్టర్స్ కుశంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెద్దమందడి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలోరూ.3 కోట్లతో నిర్మించనున్న స్టాఫ్ క్వార్టర్స్, డైనింగ్ హాల్ కుశంకుస్థాపన చేశారు. రూ. 2 కోట్లతో ఘన్ పూర్ లోని గిరిజన సంక్షేమ పాఠశాలలోడార్మెటరీ, డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వనపర్తిబస్టాండ్‌లో విస్తరణ పనుల కోసం రూ.2.50కోట్లతో నిర్మాణ పను లకు శంకుస్థాపనలు చేశారు.వనపర్తి మున్సిపాలిటీలో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సహా పలు అభివృద్ధి పనుల కోసం రూ.24 కోట్లతో చేపట్టనున్న పనులకుశంకుస్థాపన చేశారు.వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల భవనంలో రూ.13 కోట్లతోవిస్తరణ పనులతోపాటు హాస్టల్ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.కొత్తకోట పట్టణంలో మొత్తం రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రులుశంకుస్థాపన చేశారు. శంకుస్థాపనలు చేసిన వాటిలో రూ.6 కోట్లతో కొత్తకోటమున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికిశంకుస్థాపన చేశారు. అదేవిధంగా చెనగ చెరువు కట్ట అభివృద్ధి కోసం రూ. 5కోట్లతో, పార్కుల అభివృద్ధి కోసం రూ.2 కోట్లతో, రూ.50 లక్షల వ్యయంతోరహదారులపై ప్లాంటేషన్, రూ.1.50 కోట్లతో స్టోమ్ వాటర్ డ్రైనేజీ పనులనిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా కొత్తకోట పట్టణంలో రూ.1.50కోట్లతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును మంత్రులు ప్రారంభించారు.పెబ్బేరు పట్టణంలో రూ.15 కోట్లతో వివిధ వార్డుల్లో సిసి రోడ్లు,డ్రైనేజీలు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనచేశారు. అదేవిధంగా పెబ్బేరు పట్టణంలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్నస్టోమ్ వాటర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పెబ్బేరు బస్టాండ్ లోరూ. కోటి వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు.పెబ్బేరు పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగానిర్మించిన 2000 టన్నుల సామర్థ్యం గల గోదామును ప్రారంభించారు. అనంతరంపెబ్బేరు పట్టణంలో రూ.1.75 కోట్లతో 40 కమ్యూనిటీ హాల్ ల నిర్మాణానికిశంకుస్థాపన చేశారు.పెబ్బేరు మండల పరిధిలో నూతనంగా నిర్మించిన 33/11విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవం,తోమాలపల్లి గ్రామ శివారులో రూ.1.76 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రులు ప్రారంభించారు. అదేవిధంగా రూ.1.87కోట్లతో ఘనపురం మండలం అల్మాయిపల్లి, రూ.2.05 కోట్లతో పెద్దమందడి మండలంమంగంపల్లిలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను కూడాఇక్కడి నుంచే ప్రారంభించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిమాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు పట్టణాలు, గ్రామాల సమగ్ర అభివృద్దేప్రజా ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోపట్టణాలు, గ్రామాలు అభివృద్ధి పథం లో దూసుకు వెళ్తున్నాయన్నారు. సీఎంరేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇంటి తరహాపథకం దేశంలో మరెక్కడ లేదు అన్నారు. రాష్ట్రంలో పార్టీలకి అతీతంగా పథకాలఅమలు చేసి అందరికి సమన్యాయ చేస్తున్నాం అన్నారు.గత ప్రభుత్వం పదేళ్లుగారేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతఅర్హులందరికీ రేషన్ కార్డులు అందజేసి 3.70 కోట్ల మందికి సన్న బియ్యంపంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు రూ.5 లక్షలనుంచి రూ.10 లక్షలకు వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.తనకు నల్గొండ జిల్లా అంటే ఎంత ప్రేమ ఉందో పాలమూరుపై కూడా అంతే ప్రేమఉందని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో సమ్మక్క సరళమ్మ జాతరను కూడా కని వినిఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్‌స్కూల్స్ తో అదునాతన సౌకర్యాలతో పేద పిల్లలు చదువునే విధంగానిర్మిస్తున్నామన్నారు. వెనకబడిన జిల్లాల అభివృద్ధి తమ ప్రభుత్వంలక్ష్యమని చెప్పారు. గతంలో పాలమూరు రంగారెడ్డిని నిర్లక్ష్యం చేశారనివిమర్శించారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పండగ అంటే పట్టణాలు, గ్రామాలుఅభివృద్ధి చెందితేనే నిజమైన పండగ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత రైతులకు కనీసం మద్దతూ ధరతో పాటు, బోనస్ కూడా ఇవ్వడంజరుగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డులు అందించి, పేదలందరికీసన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. రూ.110 కోట్లతోకురుమూర్తి జాతర రోడ్డు వేసేందుకు శాంక్షన్ ఇచ్చినందుకు మంత్రికోమటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నోటిఫికేషన్ లు ఇచ్చి 68 వేలఉద్యోగాలు ఇచమన్నారు. అదేవిధంగా గృహజ్యోతి పథకంతో పేదల గడపల్లో వెలుగులునింపామన్నారు.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూవనపర్తితో పాటు అన్ని పట్టణాలు గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వంకట్టుబడి ఉందని చెప్పారు.

ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ వనపర్తినిఅభివృద్ధి చేయడమే నా లక్ష్యమని చెప్పారు. వనపర్తి నియోజకవర్గం నుంచి కీలకనాయకులు ప్రాతినిత్యం వహిస్తున్నారని, అందరం కలిసి కట్టుగా అభివృద్ధిచేస్తామన్నారు. రెండు యేండ్లలో వనపర్తిలో రూ.3వేలకోట్లతో అనేకఅభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. వనపర్తిఅభివృద్ధికి సీఎం అడిగిన వెంటనే నిధులు ఇస్తు న్నారన్నారు. పెబ్బేరు లోరూ.47 కోట్లతో ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్ మంజూరు చేసిన మంత్రివర్యులువాకిటి శ్రీహరికి ధన్యవాదములు తెలిపారు. అదేవిదంగా వనపర్తిలో రూ. 81కోట్లతో కోర్టు కాంప్లెక్స్ తోపాటు, రూ.298 కోట్ల ఆర్ అండ్ బీ రోడ్లుమంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. వనపర్తి బైపాస్ రింగ్ రోడ్ కోసం సహకారం ఇవ్వాలి అని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేజి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ధ్యేయంఅన్నారు. కొత్తకోటలో 144 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామన్నారు. అంతేకాకుండా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్,ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం


## రేలకుంటలో యువసేన యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు





**నల్లబెల్లి, జనవరి 14 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామంలో యువ సేన యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో ఎలబోయిన పల్లవి ప్రథమ బహుమతి గెలుచుకోగా, ఎలబోయిన స్రవంతి ద్వితీయ బహుమతిని సాధించారు. విజేతలకు బహుమతులను మండల నాయకులు నాగేంద్ర బాబు, బల్ల మునేందర్,సర్పంచ్ శ్రీధర్, ఎర్రబెల్లి రఘుపతి, మాజీ సర్పంచ్ రత్నాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదా యా లను కాపాడే ఇలాంటి కార్యక్రమాలు యువత ఆధ్వర్యంలో జరగడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళల్లో దాగి ఉన్న కళా ప్రతిభ ను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో యువ సేన యూత్ అధ్య క్షుడు వినయ్, ఉపాధ్య క్షుడు దేవరాజ్‌తో పాటు నరేష్, జి.దేవరాజు, నితిన్, రాజ్‌కుమార్, శ్రవణ్ తదితర యువసేన నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 16న సీఎం రేవంత్ రెడ్డి నిర్మల్ పర్యటన

### సదర్మాట్ బ్యారేజీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్ ప్రతినిధి, జనవరి 14.(నినాదం):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల. రేవంత్ రెడ్డి ఈనెల 16న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా ప్రజల దశాబ్దాల కల, ప్రతిష్టాత్మక సదర్మాట్ బ్యారేజీని ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కలిసి బ్యారేజీ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ నిర్మాణం, ప్రారంభోత్సవ వేదిక, భద్రతా ఏర్పాట్లను మంత్రి



సమీక్షించారు. బ్యారేజీ గేట్ల పనితీరును స్వయంగా పరిశీలించిన మంత్రి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీతో ఈ ప్రాంత రైతాంగ కల సాకారం కాబోతోంది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో, అత్యంత అట్టహాసంగా నిర్వహించాలి. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా వ్యవసాయ రంగానికి ఈ బ్యారేజీ వెన్నెముకగా నిలుస్తుందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసిందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా భోగి వేడుకలు

**కల్వకుర్తి, జనవరి 14 (నినాదం) :** సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలు ఎంతో ఉత్సాహంగా మూడు రోజులపాటు జరుపుకోవడం ఆనవాయితి. భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణలో బుధవారం వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో భోగి పండుగను వైభవోపేతంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ సెక్రటరీ జూలూరు రమేష్ బాబు హాజరయ్యారు. భోగి పండుగ విశిష్టతను తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా భోగి పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. మూడు రోజులపాటు పండుగ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ చిదిరే శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్



కల్మిచర్ల గోపాల్, జాయింట్ సెక్రెటరీ గుగ్గిల శంకర్, ప్రచార కార్యదర్శి చిగుల్లపల్లి శ్రీధర్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధ ప్రసాద్, వాసవి క్లబ్ లా అధ్యక్షులు బాదం హరీష్, బాదం సాయి లక్ష్మి, కార్యదర్శులు గోవింద సంతోష్, గోవింద మౌనిక, బాదం రాఘవేందర్, జూలూరు సత్యం,శివ జగదీశ్వర్, దాచేపల్లి మనోహర్, గుబ్బ కిషన్, కల్వ ఆంజనేయులు, గోవింద శ్రీనివాస్, నరసింహులు గుప్త, సంబు తరుణ్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్‌ల డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై అఖిలపక్ష సమావేశం

**జమ్మికుంట, జనవరి 14 (నినాదం):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై పలు పార్టీల నాయకులతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్ లలో ఫిర్యాదుల మేరకు మరొక్కసారి పునః పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. పార్టీల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన పోలింగ్ స్టేషన్ ల సమస్యలను ఆయన విశదీకరించి, దానిపై రెండు, మూడు రోజుల్లో పోలింగ్ స్టేషన్ లను పరిశీలించనైనది అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపిఓ శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వాణి లతో పాటు పలు రాజకీయ పార్టీల




నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యం

### బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ

**వనపర్తి ప్రతినిధి, జనవరి 14 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే సాధ్యమవుతుందని బిజెపి జిల్లాఅధ్యక్షుడు డి.నారా యణ అన్నారు.వనపర్తి మండలం గుంత తండా గ్రామ పంచాయతీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగాపోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓటమి చెందిన వశీరాం నాయక్ తన అనుచరులతోకలిసి బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, జిల్లా పరిషత్ మాజీచైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగాబిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని, గ్రామాలలో అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిపేపర్ ప్రకటనలు, గోబెల్స్ ప్రచారంలో కాలం సాగదీస్తున్నాడని విమర్శించారు.తాజాగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలను కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చేరూ.3,000 కోట్ల నిధుల కోసమే ఎన్నికలు జరిపించాడని, దేశంలో ఏరాష్ట్రంలోనైనా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు పూర్తిగా నిధులు కేంద్రప్రభుత్వానివేనని చెప్పారు. గత పది ఏండ్ల బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో నాయకుడు మారిండు కానీ పాలన ఏమాత్రం మారలేదని, అప్పుచేస్తే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిఏర్పడిందన్నారు.జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ

కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని మరింత గ్రామాలలో రైతులకు,ఉపాధి కూలీలకు మెరుగైన ఉపాధి సహకారం లభిస్తుందన్నారు. గతంలో వందరోజులఉపాధి దినాల స్థానంలో 125 రోజులు ఉపాధి కల్పించకపోతే ప్రభుత్వమే భృతికల్పించేలా నిర్ణయం గ్రామసభ ద్వారానే తీసుకోవడం జరుగుతుందని, చేసిన పనికిసరైన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ గౌరవ వేతనం సరైనసమయంలో అందేలా గతంలో ఉన్న ఆరు శాతం నిధులను తొమ్మిది శాతానికి పెంచడంజరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ఎంత అరిచి గోలపెట్టిన దేశ ప్రజలుప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటే ఉన్నారని, జిరాంజి చట్టం వల్ల ఉపాధిహామీ కూలీలకు, వ్యవసాయ దారులకు ఎలాంటి నష్టం జరగదని తేల్చిచెప్పారు.సర్పంచ్ గా కొద్ది ఓట్ల తేడాతో ఓటమి చెందిన వాసి రామ్ నాయక్ తోపాటు విష్ణు బాబు, రమేష్, అభిషేక్, రాజమ్మ, హాలియా, మాజీ వార్డు మెంబర్లతో పాటు పెద్ద ఎత్తున యువత బిజెపిలో చేరడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి,వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు,వారణాసి కల్పన, సీనియర్ నాయకులు చిత్తారి ప్రభాకర్, రామన్న గారివెంకటేశ్వరరెడ్డి, సీతారాములు, బచ్చు రాము, అలివేలమ్మ, గొర్ల బాబురావు,బండారు కుమారస్వా మి, జంగల్ సురేందర్, సరోజ, మనీ వర్ధన్, తిరుపతయ్య, దాసరాజు ప్రవీణ్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులుగంధం ప్రవీణ్, కవిత, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, సుగురు రాములు,జిల్లా కౌన్సిల్ సభ్యులు పి. బాలరాజు, వాకిటి సుదర్శన్,నవీన్ పవన్,పుందెకోటి అంజి, వుందేకోటి వెంకటేష్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్

### క్రీడాభిమానుల్లో ఉత్సాహం, నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు

**మహేశ్వరం,( నినాదం):** రాష్ట్ర ప్రజలందరికీ సర్పంచ్ రామావత్ లక్ష్మి గోబ్రియా నాయక్, ఉపసర్పంచ్ రామావత్ చందు లాల్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి చారకొండ మండల అధ్యక్షులు రామావత్ సాయికుమార్‌లు నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలం సారం బండా తండా గ్రామపంచాయతీ పరిధిలోని స్థానిక యువత క్రీడా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమ శిక్షణ, ఐక్యతను పెంపొందిస్తా



యని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఇలాంటి టోర్నమెంట్లు మంచి అవకాశమని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు పాల్గొనగా, మొదటి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఆటగాళ్ల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరై మ్యాచ్‌ను ఆసక్తిగా వీక్షించారు. ఈ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగి యువ క్రీడాకారులకు ప్రోత్సాహంగా నిలవాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు యువకులు అభిమానులు బంధువులు మిత్రులు స్నేహితులు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాల అమలుతోనే ప్రమాదాల నివారణ

### ఎస్సై ఉదయ్ కుమార్

**వెల్గటూర్, జనవరి13(నినాదం న్యూస్):** వాహనదారులు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్,భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందని ఎస్సై ఉదయ్ కుమార్ అన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం,పోలీస్ శాఖ చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని



అంబేడ్కర్ కూడలి వద్ద ఎస్సై ఉదయ్‌కుమార్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కుమార్ మాట్లా డుతూ.. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని,హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించాలని,మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు.ప్రభుత్వ నిబంధనలు మీరితే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కార్యక్రమంలో గ్రామస్తులు,నాయకులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ చేరిన అనిల్

**చేవెళ్ళ జనవరి14(నినాదం):** చేవెళ్ళ మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద మాజీ వార్డ్ సభ్యులు బేగరి అనిల్‌కి బిఆర్ఎస్ పార్టీ రాజేం ద్రనగర్ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్ర మంలో గ్రామస్థులు పోతురాజు నరేష్,బేగరి శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: సర్పంచ్ రాజేశ్వరి రవి గౌడ్

**కల్వకుర్తి, జనవరి 14 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే లక్ష్యంతో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లెల్ల సర్పంచ్ రాజేశ్వరి రవి గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ, ఎస్టీ అండ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు, ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్‌తో కలిసి చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర అందిం చాలని



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటివి మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నారని, వారి అభ్యున్నతికి ప్రభు త్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. అర్హులైన వారందరికీ చీరలు అందచేస్తామన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎముక రవి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముచర్ల శ్రీకాంత్ రెడ్డి, దేవాలయ వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి, వార్డు సభ్యులు గుమ్మకొండ నాగమణి మహేందర్, తాడేం మౌనిక మల్లయ్య, డొక్కు చెన్నమ్మ జంగయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాప మల్లయ్య, మాజీ కో ఆప్షన్ నెంబర్ గుమ్మ కొండ బాల్ జంగయ్య,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎముక శ్రీహరి, నాయకులు మొక్తాల బాల్ జంగయ్య,చిక్కొండ మల్లయ్య,వీరెడ్డి వెంకట్ రెడ్డి, డొక్కు రమేష్, గుమ్మకొండ వెంకటయ్య, కుమ్మరి శ్రీరాములు, గుమ్మకొండ జంగయ్య, పిప్పల్ల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం




**చింతపల్లి ,జనవరి 14 ( నినాదం)** మండలంలోని వింజమూరు గ్రామ పరిధిలో ఉన్న శ్రీ హరి హర క్షేత్రం లో శ్రీ గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కావేటి శ్రీనివాస్ సుధ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ మండపాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందా గోవింద నామ స్మరణలు, మేళ తాళాల మధ్య శ్రీ గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి భక్తులు పారవశ్యం చెందారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కావేటి యాదమ్మ ఫకీరా, తెరటుపల్లి విద్యావతి గురునాథం, బాదం నరేందర్ దంపతులు, ఆలయ సూపర్వైజర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## గడియ గౌరారంలో వాలీబాల్ పోటీలు

**చింతపల్లి, జనవరి 14 (నినాదం):** సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గడియ గౌరారం గ్రామంలో వాలీబాల్ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద 10116 రూపాయలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు గునమోని శ్రీశైలం యాదవ్, మురళీధరా చారి ద్వితీయ బహుమతితో పాటు క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉజ్జిని రఘురామ్ రావు ,అన్నదానం చేసిన వార్డు సభ్యులు నాగమళ్ళ కవిత యాదగిరి, గుండెబోయిన సైదులు, కంబాలపల్లి గిరిస్వాతి , కె. సైదులు, కంబాలపల్లి మహేశ్వరీ శేఖర్, ఆర్గనైజేషన్ ప్రకాష్, చిన్న, కె. నాగార్జున, సంతోష్ రావు, బి. గోపాల్,




కె. నరేష్ జగదీశ్, ఎస్కె. రహీం, బి. కొండల్, కొట్ల రాజేందర్ రావు,జక్కుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## భోగి మంటలతో యువత చిందులు





**చింతపల్లి,జనవరి 14 ( నినాదం):** సంక్రాంతి పండుగ సందర్భంగా భోగభాగ్యాలను అందించే భోగిమంటలతో యువత బుధవారం మండలంలోని గ్రామ గ్రామాన చిందులు వేసినట్టు తెలుస్తోంది. మండల కేంద్రంలోని 12వ వార్డులో వార్డు సభ్యుడు చెట్లపల్లి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్స్ రోడ్ వద్ద భోగి మంటలను ఆస్వాదిం చారు. తెల్లవారుజామునే లేచి వార్డులో ఉన్న సభ్యులంతా ఒక దగ్గర చేరి పిడకలు, కర్రలతో, భోగి మంటలను ఏర్పా టు చేసి అందులో సుగంధ ద్రవ్యాలు వేసి భోగి పాటలు వింటూ చిందులు వేశారు. మండలంలోని కొన్ని గ్రామా లలో అనాదిగా వస్తున్న ఆచారాలను పాటిస్తూ తమ చిన్నా రుల భవిష్యత్తు బాగుండాలని ఆకాంక్షిస్తూ భోగి పండ్లను చిన్నారులకు పోసి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో బిజెపి మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, పందుగుల సాయి కుమార్, రైస్ మిల్ యజమాని సురేష్ , ఆకుతోట జంగయ్య, సోలార్ ప్రాజెక్టు ఇంజనీర్ సిద్ధనూరి వెంకటేశ్వర్లు, తెరటుపల్లి శివ,సరాబు వెంకటయ్య, చీమల వెంకటేష్, కళ్లెం రమేష్, శివ నాయక్, గుండ్లపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగ్గుల పోటీలు..



మెట్ పల్లి జనవరి:14( నినాదం) : మకర సంక్రాంతి పండగను పురస్కరించుకొని, పట్టణంలోని ఆదర్శనగర్ దుర్గాదేవి సేవా సమితి అధ్యక్షులు బోండ్ల నరేష్, గౌరవాధ్యక్షులు బెజ్జారపు ఆధ్వర్యంలోబుధవారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో గెలిచిన వారికి,ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు 50 మందికి అందజేశారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి, ఎగోలపు శేఖర్, పెప్సీ లక్ష్మణ్ పాసి కంటి శ్రీనివాస్ శ్యామ్ వారి పెల్లి గంగాధర్ ప్రకాష్ దాసరి రాజు శంభోజి శ్రీధర్ గుర్రాల రాధా కిషన్ బొమ్మన చిన్నయ్య దాత్రిక భూమేశ్వర్ నడిమెట్ల ప్రభాకర్ బొమ్మన రామస్వామి డానిస్ గౌడ్ కృష్ణ, తదితురు పాల్గొన్నారు.



గురువారం, తెలంగాణ
15 జనవరి 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# అంగరశీగ వైభవంగా శ్రీవారి చక్రస్నాన

## వేదోక్తంగా జరిగిన వేడుకల్లో వేలాదిగా హాజరైన భక్తులు

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు





కోరుట్ల, జనవరి 14 : కన్నుల పండుగగా వేదోక్తంగా అంగరశీగ వైభవంగా నిర్వహించిన శ్రీవారి చక్రస్నానం వేడుకల్లో వేలాది మందికి పైగా భక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల పట్టణ అతి పురాతన దేవాలయాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయమొకటి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం మల్లాపూర్ మండలం కొత్త దామరాజ్ పల్లి గ్రామ గోదావరి నది తీరంలో శ్రీవారికి చక్రస్నాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం చక్రస్నాన వేడుకల్లో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అత్యధికంగా కోరుట్ల నియోజకవర్గం కు నిధులు కేటాయించేలా కృషి చేస్తారని తెలిపారు.

అలాగే ఆ స్వామి వారి కృపా కటాక్షలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది నర్సింహచారి మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలో కూడా అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అనాదిగా ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తుంటామన్నారు. ఇందులో భాగంగా శ్రీ గోదారంగనాథుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటామని ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు కోరుట్ల పట్టణం వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి మల్లాపూర్ మండలం కొత్త దామరాజ్ పల్లి గ్రామ సమీపంలోనూ గోదావరి నదిలో శ్రీవారి సుదర్శన చక్రానికి చక్రస్నానం నిర్వహించడం మానవాహీతీగా వస్తుందన్నారు. ఈ ఆనవాయితీలో భాగంగానే ఈ సంవత్సరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ ఎతిరాజం నర్సయ్య, ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కోట గంగాధర్, గోడికె రాములు, చిలువేరి విజయకుమార్, చిట్యాల పద్మ, ఆలయ ఈవో ఎం. విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య, కోరుట్ల పట్టణ గ్రామ ప్రజలతో పాటు కొత్తధామ్ రాజ్ పల్లి గ్రామ ప్రజలు భక్తులు మహిళలు ఆండాళ్ గోష్టి బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ సంస్కర్త త్రిపురనేని

## త్రిపురనేని రామస్వామి జయంతి



'కవిరాజుగా ప్రసిద్ధి చెందిన 'త్రిపుర నేని రామస్వామి (జనవరి 15, 1887 – జనవరి 16, 1943) న్యాయవాది, ప్రముఖ హేతువాద రచయిత, మనసా, వాచా, కర్మణా సంఘ సంస్కర్త. ప్రసిద్ధ కవి రాజుగా పిలువబడే ఆయన హేతువాదం, మానవతా వాదం తెలుగు కవిత్వం, సాహిత్యాల్లో లోకి మొదటి సారిగా ప్రవేశపెట్టిన కవిగా భావిస్తారు. త్రిపురనేని రామస్వామి 1887 జనవరి 15 న కృష్ణా జిల్లా, అంగ లూరు గ్రామంలో ఒక రైతు కుటుం బంలో జన్మించారు. నాటికే భారత దేశంలో ప్రచారంలో ఉన్న సామాజిక – మత సంస్కరణ ఉద్యమాలలో పాల్గొన్నారు. రాజా రామ్ మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, గోవింద రనడే, దయానంద సరస్వతి మొదలైన వారి ఆదర్శాలను ప్రజల లోనికి తీసుకు రావడానికి ఉద్యమించిన వారిలో రామస్వామి ఒకరు.

రామస్వామి రైతు కుటుంబములో పుట్టినా చిన్నప్పటినుడి సాహితీ జిజ్ఞాసతో పెరిగారు. 23వ యేట మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణుడైనా రు. అదే సంవత్సరము ఆయన పల్నాటి యుద్ధము ఆధారముగా "కారెంపూడి కదనం", మహాభారత యుద్ధము ఆధారముగా "కురుక్షేత్ర సంగ్రామం" రెండు నాటికలు రచిం చారు. 1911లో ఇంటర్మీడియట్ చదవడానికి బందరు లోని నోబుల్ కాలేజీలో చేరాక, అక్కడ అవధానము చేసి తన సాహితీ నైపుణ్య మును, అద్భుతమైన జ్ఞాపకశక్తిని ప్రదర్శించారు.

1898లో పున్నమ్మను పెళ్ళి చేసు కున్నారు. 1910లో వారికి కలిగిన కుమారుడే ప్రఖ్యాత రచయిత, త్రిపురనేని గోపీచంద్. 1914లో న్యాయ శాస్త్రం చదివేందుకు డబ్లిన్

వెళ్ళి, ఆంగ్ల సాహిత్యము, ఆధునిక ఐరోపా సంస్కృతి కూడా చదివారు. డబ్లిన్ లో చదువుతున్న రోజుల్లోనే అనీ బీసెంట్ ప్రారంభించిన హోం రూల్ ఉద్యమంకు మద్దతు ఇవ్వ వలసినదిగా భారతీయులకు విజ్ఞాపన చేస్తూ కృష్ణా పత్రికలో అనేక రచనలు చేశారు. రామ స్వామి స్వాంతంత్ర్యోద్యము రోజు లలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి ఉత్తేజ పరచే అనేక దేశభక్తి గీతాలు రచిం చారు. 1917లో భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలు మచిలీ పట్నంలో

న్యాయవాద వృత్తి నిర్వహించారు. కానీ ఆయన ముఖ్య వ్యాసంగము సంఘ సంస్కరణే. స్మృతులు, పురాణాలు, వ్యవస్థీకృత మతము వలన వ్యాపించిన కుల వ్యవస్థ మీద, సామాజిక అన్యాయాల మీద ఆయన పూర్తి స్థాయి ఉద్యమము ప్రారంభించారు. 1922లో గుంటూ రు జిల్లా, తెనాలిలో స్థిరపడ్డారు. 1925లో తెనాలి పురపాలక సంఘ చైర్మనుగా ఎన్నికయ్యాడు. తెనాలి మున్సిపాలిటీ చైర్మెన్ గా ఉన్న పుడు, గంగానమ్మ కొలుపులలో నిర్వహించే జంతు బలిని నిషేధిం చారు. ఫలితంగా ఆయనను చైర్మను పదవి నుండి తీర్మానం ద్వారా తొలగించగా, వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్ళీ ఎన్నికై, తిరిగి చైర్మను అయ్యారు. జంతు బలులు మాత్రం సాగలేదు. 1938 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. సూతాశ్రమం అనిపేరు పెట్టుకున్న ఆయన ఇల్లు రాజకీయ, సాహిత్య చర్చలతో కళకళలాడుతూ ఉండేది.

సంస్కృత భాషలో ఉన్న పెళ్ళి మంత్రాలను తెలుగులోకి అనువదించి, అచ్చులో సరళమైన వివాహ విధి అను పద్ధతిని తయారు చేసారు. ఆయన స్వయంగా అనేక పెళ్ళిళ్లకు పౌరోహిత్యము వహించి జరిపించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1943 జనవరి 16 న త్రిపురనేని రామ స్వామి మరణించారు.

1987 వ సంత్సరంలో భారతదేశ ప్రభుత్వము వారు ఆయన స్మారక చిహ్నముగా ఆయన పేరు మీద తపాళా బిళ్ళను జారీ చేయడం జరిగింది.

ప్రజలను మేలుకొలిపే హేతువాద భావాలను వ్యక్తపరచడానికి సాహితీ రచనలను సాధనంగా త్రిపురనేని ఎంచుకున్నారు. రామ స్వామి తన ఆలోచనలను సాహి త్యం ద్వారా వ్యక్త పరచడమే కాక ఆచరణలో పెట్టడానికి కూడా ప్రయత్నించారు.

"వీరగంధము తెచ్చినారము
వీరుదెవ్వడొ తెల్పుడీ
పూసి పోదుము మెడను వైతుము
పూల దండలు భక్తితో"... గేయం త్రిపురనేని రచనే...

ఒకరుడు 'వేదమే' భగవ దుక్తమటంచు నుపన్యసించు నిం
కొకరుడు 'బైబిలే' భగవదుక్త మటంచును వక్కణించు, వేరొంకరుడు మా ' ఖొరాన్ ' భగవదుక్త మటంచును వాదులాడు, నీ తికమక లేల పెట్టెదవు? తెల్పగరాదె నిజంబు నీశ్వరా...
మా మతం గొప్పదంటే కాదు మా మతం గొప్పదని వాదులాడే మతోన్మాదులను ఈసడిస్తూ
రాశారు.

సూత పురాణము, శంబుక వధ,
సూతాశ్రమ గీతాలు, ధూర్త మానవ శతకము, ఖూనీ, భగవద్గీత, రాణా ప్రతాప్, కొండవీటి పతనము, కుప్పు స్వామి శతకం, గోపాల రాయ శతకం, పల్నాటి పౌరుషం, వివాహ విధి తదితరాలు త్రిపుర నేని ముఖ్య రచనలు.

ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఆంధ్ర మహాసభ ఆయనకు కవి రాజు అనే బిరుదునిచ్చి గౌరవిం చింది. 1940లో గుడివాడ ప్రజానీకము గజారోహణ సన్మానము చేసారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

### ఆంధ్రా భీష్మాచార్యులు

# న్యాపతి సుబ్బారావు

## న్యాపతి సుబ్బారావు పంతులు వర్ధంతి



చికాగో సర్వ ధర్మ సమ్మేళనంలో పాల్గొని, భారత దేశానికి తిరిగి వచ్చిన స్వామి వివేకానంద యోగి పుంగవుడు మద్రాసు రేవులో కాలిడ గానే ఆయనను పూల మాలాలంకృతుల గావించి సాదరంగా ఆహ్వానించే అవకాశాన్ని పొందిన వ్యక్తి న్యాపతి సుబ్బా రావు. అంతేకాదు... వివేకానందుని ఆహ్వాన సభకు అధ్యక్షత వహిం చిన అరుదైన గౌరవం దక్కించు కున్న అదృష్ట వంతులు ఆయనే.

భారతదేశములో ఒక విశిష్ట స్థానం కలిగి, దక్షిణ భారత దేశములో ఎక్కువ ప్రచురణ కలిగిన పత్రికగా, ప్రాచుర్యంలో ఉన్న ది హిందూ (ఒఙ్రవ ఎఱఅఅఐ) ఆంగ్ల దినపత్రికకు పత్రికను స్థాపించి ఇప్పటికి సుమారు 120 సంవత్సరాలు దాటింది. ఈ పత్రిక ఎలా ప్రారంభించ బడింది అంటే...తిరువయ్యారుకు చెందిన 23 ఏళ్ళ జి. సుబ్రమణియ అయ్యర్, ఆయన స్నేహితుడు, పచ్చయ్యప్ప కళాశాలలో ఆయన సహోద్యోగి, చెంగల్పట్టుకు చెందిన 21 ఏళ్ళ ఎం. వీరరాఘవా చారియర్ – నలుగురు న్యాయ శాస్త్ర విద్యార్థులు టి.టి. రంగాచారియర్, పి.వి. రంగాచారియర్, డి.కేశవ రావు పంత్, న్యాపతి సుబ్బారావు పంతులు (హిందూ స్థాపకుల్లో ఆంధ్రుడు) – వీళ్ళందరూ ట్రిప్లికేన్ సాహితీ సంఘం సభ్యులు. ఈ సంఘం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడం లక్ష్యాలుగా ఏర్పడింది. ట్రిప్లికేన్ సిక్స్ అని పేరుబడ్డ ఆ ఆరుగురు యువకులు మొదట న్యూస్‌పేపర్ అనే సైక్లోస్టైల్ పక్షపత్రికను ప్రారంభించారు. చెన్నైలో ఆ పత్రికకు మంచి స్పందన లభించడంతో హిందూను వారపత్రికగా ప్రచురించడం మొదలు పెట్టారు. ది హిందూ పత్రిక స్థాపన సెప్టెంబర్ 20, 1878న జరిగినట్లు పేర్కొంటారు. అలా ది హిందూ ఆంగ్ల పత్రిక స్థాపనలో ఒక తెలుగు వారు ఉండడం విశేషం. ఏ ఐ సీ సీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పని చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఆంధ్ర భీష్మ బిరుదాంకితులు, ప్రసిద్ధి స్వాతంత్ర్య సమర యోధుడు, సంస్కరణవాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు (1856, జనవరి 14 – 1941, జనవరి 15) మకర సంక్రాంతి రోజున నెల్లూరులో రాఘవరావు, రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆ తరువాత కుటుంబం రాజ మండ్రికి మారింది. బాల్యం నుండే సుబ్బరావు విషయ పరిజ్ఞాన సముపార్జన పట్ల అమిత జిజ్ఞాస కలిగి ఉండి పేదరికం కారణంగా వీధిలాంతర్ల మసక వెలుతులో చదువు కొనసాగించారు. మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యి అనంతరం మద్రాసు క్రైస్తవ కళాశాలలో చేరి స్కాలర్‌షిప్ సహాయంతో చదువుకుని 1876లో బిఏ డిగ్రీ పొందాడు. అనంతరం అధ్యాప కునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. బోధనా వృత్తిలో కొనసాగుతూనే న్యాయవాద విద్యను అభ్యసించి 1879లో లా పట్టాను పొందాడు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. ఈ ఖ్యాతిని సాధించిన దక్షిణ భారత దేశం లోని అతి కొద్దిమందిలో ఒకరిగా కోస్తా జిల్లాల్లో తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. న్యాయ విద్యార్థిగా ఉండగానే 22 ఏళ్ళ ప్రాయంలో ఆయన ట్రిప్లికేన్ సిక్స్‌గా పిలువబడే నాటి సాహిత్య సంఘం సభ్యులు మరో ఐదుగురు సభ్యుల మిత్ర బృందంతో కలసి, జాతీయో ద్యమానికి సహకరించే ఉదాత్త లక్ష్యంతో, ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురిత మయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి.

ఉమ్మడి మద్రాసు రాష్టంలో సుబ్బా రావు గౌరవ న్యాయమూర్తి గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1880లో న్యాపతి సుబ్బారావు మద్రాసు నుంచి రాజమండ్రి తిరిగివచ్చి అక్కడే స్థిరపడ్డారు. మరో 9 మంది న్యాయ వాదులతో కలిసి రాజమండ్రి బార్ అసోషి యేషన్ స్థాపించారు. రాజమండ్రిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా మెలగేవారు. వితంతు పునర్వివాహాలు జరిపించడంలో వీరేశలింగానికి సుబ్బారావు పంతులు ఎంతగానో సహక రించారు. 1881లో స్థాపితమైన హితకారిణి సమాజం యొక్క మొదటి కార్యదర్శిగా నియమించ బడి నిర్వహణలో, కార్యకలాపాల విస్తరణలో విలువైన సేవలందిం చారు.

1885లో రాజమండ్రి పురపాలక సంఘానికి తొలి అనధికార ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1888 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే రాజమండ్రి ప్రజలకు తొలిసారి

నల్లాల కనెక్షన్లు మంజూరు చేశారు. 1893లో ఆయన మద్రాసు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికై సర్కారు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పదవిలో ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికై 1899 వరకు కొనసాగారు. 1896లో ఆయన రాజమండ్రి లోని టౌన్ హాల్ ట్రస్టుబోర్డు కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కలకత్తాలోని టౌన్ హాలు తర్వాత దేశంలో అంతటి ప్రాముఖ్యత రాజమండ్రి టౌన్ హాల్‌కు ఉంది. దీనిని కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించటం వెనుక న్యాపతి వారి సహకారం ఎంతో ఉంది. సుబ్బారావు పంతులు రాజమండ్రి ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్‌ను స్థాపించి, విద్యుదు త్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి ఆ విద్యుత్ ను సరఫరా చేసి వెలుగులు నింపాడు. 1893లో ఆయన రాజమండ్రిలో చింతామణి పత్రికను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటు లోకి తెచ్చారు. ఈ పత్రికకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎడిటర్‌గా వ్యవహ రించారు. రచయితల్ని ఆర్థికంగా ప్రోత్సహించటం లక్ష్యంగా సుబ్బా రావు పంతులు నవలారచన అంశంగా వివిధ పోటీలు నిర్వహించే వారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనా వ్యాసంగానికి సుబ్బారావు నైతికంగా, ఆర్థికంగా ఎంతో సహకరించారు. అదేవిధంగా హరికథ పితామహ ఆదిభట్ల నారాయణ దాసును రాజమండ్రి, పరిసర ప్రాంతాలకు పరిచయం చేసినది కూడా ఆయనే. 1922 ప్రాంతంలో రాజమండ్రిలో ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థ (ఇప్పుడు రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలగా ఉన్నది) ఏర్పాటును న్యాపతి సుబ్బారావు పంతులు ఎంతగానో ప్రోత్సహించారు.

1897, ఫిబ్రవరి11న స్వామి వివేకానంద అంతర్జాతీయ మతాల సమావేశంలో ప్రసంగించి భారత దేశం తిరిగివస్తున్న సందర్భంలో ట్రిప్లికేన్ సిక్స్ మిత్రబృందం ఆయన్ను ఆహ్వానించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పురజనులు హాజరైన ఆ సమావేశంలో వివేకానందుని ఆహ్వాన సంఘానికి న్యాపతి సుబ్బారావును అధ్యక్షునిగా నియమించారు. వివేకానందుడు మద్రాసు రేవులో దిగగానే పూలమాల వేసి ఆహ్వానించిన తొలి వ్యక్తి సుబ్బారావే. ఆ మరు సటి రోజు విక్టోరియా హాల్లో వివేకానందునికి ఆహ్వాన సభ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి14న మెరీనా బీచ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వివేకానందునితో పాటు సుబ్బారావు పంతులు వేదికను అలంకరించారు. అలా ప్రారంభమైన వీరి స్నేహం సుబ్బా రావుపై గాఢమైన ప్రభావాన్ని వేసింది. 1903లో వివేకానందుని స్ఫూర్తితో, సుబ్బారావు రాజమండ్రి లో భగవద్గీత, సనాతన హిందూధర్మ ప్రచారానికై, హిందూ సమాజం అనే సంస్థను స్థాపించారు.

1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించారు. 1907లో వందేమాతర ఉద్యమ సందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహిస్తూ, మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం చారిత్రాత్మకమైన పిలుపు నిచ్చారు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షుడ య్యారు. అంతేగాక ఆయన అఖిలభారత కాంగ్రేసు కమిటీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు ఎన్నికై సేవలందిం చారు. సుబ్బారావు పంతులు 1941, జనవరి 15వ తేదీన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్,**
**ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్...**
**9440595494**

# మీ భూమి మీదేనా?



తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో నేడు జరుగుతున్న పరిణామాలు సామాన్య పౌరుడి నిద్రను హరించేవిగా మారాయి. ఇది కేవలం ఒక సాంకేతిక లోపమని చెప్పి తప్పించుకునే పరిస్థితి కాదు. భూమి హక్కుల విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు వ్యవస్థాత్మక దుర్వినియోగం, నిర్లక్ష్యం, అనుమానాస్పద చర్యల శ్రేణిగా ప్రజల్లో బలమైన అభిప్రాయం ఏర్పడుతోంది. ఒకప్పుడు కబ్జాలు కళ్లముందే జరిగేవి, నేడు కంప్యూటర్ స్క్రీన్ వెనుక జరిగే మార్పులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిద్రలేపుతున్న నిజాలు:

డిజిటలైజేషన్ పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు పారదర్శకతను పెంచాల్సిన బదులు, కొన్ని సందర్భాల్లో అక్రమాలకు కొత్త మార్గాలు తెరిచాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చలానాల సవరణలు, రికార్డుల మార్పులపై అనేక ఫిర్యాదులు రావడం తేలికగా తీసుకునే అంశం కాదు. భూమి రికార్డులు పూర్తిగా భద్రమనే నమ్మకం సామాన్యుడిలో క్రమంగా క్షీణిస్తోంది. ఈ రోజు నా పేరు ఉన్న భూమి, రేపు అలాగే ఉంటుందా? అన్న సందేహం రైతు గుండెల్లో నాటుకుపోతోంది.

చట్టాల ఆత్మకు విరుద్ధంగా సాగుతున్నాయా రిజిస్ట్రేషన్లు?

రిజిస్ట్రేషన్ చట్టం1908లోని సెక్షన్ 17 ఉద్దేశ్యాన్ని పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని వ్యవహారాలు నడుస్తున్నాయన్న ఆరోపణలు తీవ్రమైనవే. చలానాల మార్పులు, అనుమానాస్పద పత్రాల వినియోగం వంటి చర్యలు భారతీయ న్యాయ సంహితలోని మోసం, నకిలీ పత్రాల సృష్టి, ఫోర్జరీ నిబంధనల పరిధిలోకి వచ్చే అవకాశముందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, చట్టపరమైన గంభీర పరిణామాలకు దారితీయగల అంశం. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన సెక్షన్ 22–ఏ నిషేధిత జాబితా అమలుపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో కొందరు రైతుల పట్టా భూములను ఆ జాబితాలో చేర్చినట్లు వచ్చిన ఫిర్యాదులు రాజ్యాంగం కల్పించిన ఆస్తి హక్కును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్న భావనకు దారి తీస్తున్నాయి. నిబంధనలు ప్రజల రక్షణ కోసం ఉంటాయా, లేక వేధింపుల సాధనంగా మారాయా అన్న సందేహం తలెత్తడం వ్యవస్థకు సిగ్గుచేటు.

డిజిటల్ భద్రత కూలిపోతుందా?

డిజిటల్ భద్రత అంశం అత్యంత ఆందోళనకరం. సమాచార సాంకేతిక చట్టం2000 ప్రకారం ప్రభుత్వ దత్తాంశానికి కఠినమైన భద్రతా ప్రమాణాలు ఉండాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నియంత్రణలు బలహీనంగా ఉన్నాయన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. అనధికారికంగా ప్రభుత్వ సర్వర్లలో మార్పులు జరిగితే, అది తీవ్రమైన సైబర్ నేరంగా పరిగణించబడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లక్షలాది రైతుల వ్యక్తిగత వివరాలు, భూమి హక్కుల సమాచారం ప్రమాదంలో పడుతోందన్న భావనను ప్రభుత్వం తేలికగా విస్మరించలేదు. తహసీల్దార్లు, రిజిస్ట్రేషన్ అధికారులు తమ బాధ్యతలను కేవలం సంతకాల వరకే పరిమితం చేయడం సరిపోదు. చలానాల చెల్లింపులు, డిజిటల్ ఎంట్రీలు, బ్యాంకు ధ్రువీకరణలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్న వాస్తవాన్ని విస్మరించడం నేరపూరిత నిర్లక్ష్యంగా భావించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమగ్ర ఆడిట్ జరగకపోవడం వెనుక ఉన్న కారణాలపై కూడా లోతైన విచారణ అవసరం.

వ్యక్తులకాదు.. వ్యవస్థకే విచారణ అవసరం!

మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం కింది స్థాయి సిబ్బందిని బలికొట్టి చేతులు దులుపుకునే ధోరణిని వీడాలి. ఇది వ్యక్తుల సమస్య కాదు వ్యవస్థలోని లోపాలు, అనుమానిత కుమ్మక్కులపై సమగ్ర న్యాయపరమైన తనిఖీ అవసరం. అక్రమ రిజిస్ట్రేషన్లను చట్టబద్ధంగా రద్దు చేయడం, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుండి రికవర్ చేయడం, బ్యాంకు సర్వర్ ఆధారిత స్వయం ధ్రువీకరణ వ్యవస్థను అమలు చేయడం వంటి కఠిన నిర్ణయాల ద్వారానే ప్రజల్లో మసకబారిన నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చు. లేదంటే.. మీ భూమి మీదేనా? అన్న ప్రశ్న రేపు ప్రతి ఇంటి ముందూ నిలబడటం ఖాయం.



**ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**



### ప్రజా సమస్యలు వెలికి తీయడంలో
# నినాదం నికార్సైన పాత్ర పోషిస్తుంది
## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ జనవరి 14( నినాదం)**
ప్రజా సమస్యలు వెలికి తీయడంలోనూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందడంలో నినాదం పత్రిక ముఖ్యపాత్ర వహిస్తుందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నల్లగొండ ప్రతినిధి బొంగరాల మట్టయ్య ఆధ్వర్యంలో నినాదం డైలీ పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారులకు తెలియజేయడంలో నినాదం పత్రిక కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, nబంజారా ఉద్యోగుల సంగం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దశరథ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, పత్రికా విలేకరులు హమీదుద్దీన్, ఎండి అస్లం, రంగా శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వాస్తవాలను ప్రజలకు చేరవేసేదే నినాదం
## ప్రజా సమస్యలను ప్రభుత్వానికి వినిపించే గొంతుక నినాదం
## గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్ రావు, బీఆర్ఎస్ నాయకులు జరుపుల కాలు నాయక్







**డోర్నకల్/మరిపెడ జనవరి 14(నినాదం)**
ప్రజా సమస్యలను ప్రభుత్వానికి వినిపించే గొంతుక నినాదం పత్రిక అన్ని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు.. మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ భవన ఆవరణంలో నినాదం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.నిజాన్ని నిర్భయంగా రాస్తూ పార్టీలతీతంగా ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరే విధంగా నినాదం పత్రిక పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికలు పనిచేస్తాయన్నారు.గాలివారి గూడెం గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ నా రెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి నినాదం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు జరుపుల కాలు నాయక్ క్రికెట్ క్రీడాకారుల సమక్షంలో నినాదం క్యాలెండర్ ను ఆవిష్కరించి మాట్లాడారు.వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో నినాదం పత్రిక ముందుంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలు చేరవేయడంలో పత్రికలు ఎంతగానో దోహదపడతాయన్నారు.ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉప్పల నాగేశ్వరరావు,బీఆర్ఎస్ నాయకులు పానుగోత్ వేంకన్నా,సయ్యద్ లతీఫ్, ఎల్ వి వెంకన్న, వీరభద్రం,భద్రయ్య, పరశురాములు,బీఆర్ఎస్ మాజీ వార్డ్ కౌన్సిలర్లు ఇంకా తదితరులు పాల్గొన్నారు..

# మోసం చేసి... భూమిని కాజేసి!
## వృద్ధురాలిని మోసం చేసిన మనమరాలు.. మీడియా ఎదుట వృద్ధురాలి ఆవేదన

**జమ్మికుంట, జనవరి 14 (నినాదం)**
వృద్ధురాలికి అండగా ఉండి అన్నీ చూసుకోవలసిన ఓ మనవరాలు ఆమెను మోసం చేసి భూమిని కాల్ చేయడమే కాకుండా తనను చిత్రహింసలకు గురి చేస్తుందని ఓ వృద్ధురాలు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. వృద్ధురాలు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మండలం శంభుని పల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి ఈశ్వరమ్మ తిరుపతి రెడ్డిలకు ఒక కుమారుడు ఇద్దరు కూతుళ్లు. కొడుకుకు ముగ్గురు కూతుర్లు ఉండగా అందరికీ వివాహాలై వేరువేరుగా ఉంటున్నారు. వృద్ధురాలి భర్త తిరుపతిరెడ్డి 2020లో ఆరోగ్యం బాగాలేక మృతి చెందాడు. తన ఆరోగ్యం బాగా లేని సమయంలో 2016 లోనే తన చిన్న మనవరాలు స్వాతి తన భర్తను తీసుకుని వెళ్లి 238/8/0/1/1/1/2/1/1/1 సర్వే నెంబర్ లో గల2.14 గుంటలు రిజిస్ట్రేషన్ విల్లు చేయించింది. ఇందులో 1.07 గుంటల స్వాతి పేరు మీద ఒకటి పాయింట్ జీరో సెవెన్ తన కొడుకు పేరు మీదుగా చేయించిందని తెలిపింది. అదేవిధంగా తనకు ఉన్నటువంటి వ్యవసాయ భూమిని స్పెషల్ జిపిఏ ద్వారా 5.22 గుంటల భూమిని మాదిరెడ్డి సుభాషిని పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించింది. తన భర్త చనిపోయిన నెలరోజుల తర్వాత హనుమకొండకు పిలిచి పింఛన్ కోసం అని చెప్పి తన ద్వారా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించిందని ఈ విషయం తనకు తెలిసి నిలదీస్తే తనకు తిండి పెట్టకుండా బయటికి గెంటి వేసి తన కాలు విరగొట్టిందని



బోధిస్తూ తెలిపింది. మిగతా ఇద్దరు మనవరాలు ఈ విషయం గురించి నిలదీస్తే వారిని సైతం ఇబ్బందులకు గురి చేస్తుందని తనకు ఉన్నటువంటి భూమిని మోసం చేసి తన మనవరాలు స్వాతి రిజిస్ట్రేషన్ చేయించుకుందని పేర్కొంది. తన భర్త ద్వారా వచ్చిన భూమిని తనకు ఇప్పించి తగు న్యాయం చేయడమే కాకుండా తన మనవరాలి నుండి కూడా తనకు ప్రాణభయం ఉందని తగు రక్షణ కల్పించాలంటూ మీడియా ఎదుట బోరున విలపించింది. నానమ్మను మోసం చేసి ఆస్తిని కాజేసిన మనవరాలి నుండి రక్షణ కల్పించాలంటూ ఉన్నతాధికారులకు పోలీసులకు విజ్ఞప్తి చేసింది.



# సరదాగా గుర్రంపై శంకర్
## ప్రత్యేక ఆకర్షణగా గుర్రం

**కోదాడ,జనవరి 14(నినాదం):**
కోదాడ పట్టణంలో ఉప్పల శంకర్ అనే వ్యక్తి సరదా కోసం లక్షలు ఖర్చు చేసి మార్వాడి స్టాలిన్ జాతికి చెందిన గుర్రాన్ని కొనుగోలు చేశాడు. గత నాలుగు నెలలుగా ఈ గుర్రంపై పట్టణంలో తిరుగుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. హైదరాబాదులో 2 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ గుర్రానికి రోజు శనగలు, ఉలువలు దానంగా పెడుతున్నాడు. రోజు పది కిలోమీటర్ల వరకు గుర్రంపై తిరుగుతూ ఆనందిస్తున్నాడు. స్థానికులు, పిల్లలు గుర్రాన్ని చూసి సెల్ఫీలు దిగుతున్నారు.

# మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి
## కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి
## బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన 51 డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు



**కరీంనగర్, జనవరి 14(నినాదం)**
కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. తద్వారా కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదన్నారు. కాంగ్రెస్ తోపాటు అధికారంలోకి లేని బీఆర్ఎస్ కు ఓటేయడంవల్ల అభివృద్ధి ఆగిపోయే ప్రమాదముందని తెలిపారు.బుధవారం రోజున బీఆర్ఎస్ కు చెందిన 51వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు, మల్లంపహాడ్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, 46వ డివిజన్ సీనియర్ నేతలు ప్రమోద్ రావు, గాజె శివరాం బీజేపీలో చేరారు. వీరితోపాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి తరలివచ్చి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బండారు వేణు, సాధినేని మునీందర్, ప్రమోద్ రావు, గాజె శివరాం మాట్లాడుతూ, కేంద్రం నుండి వచ్చిన నిధులవల్లే కరీంనగర్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. బండి సంజయ్ కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులను తీసుకురావడంవల్లే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయనీ తెలిపారు స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ నిధులుసహా అనేక రూపాల్లో కేంద్రం నిధులు విడుదల చేస్తోందన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేస్తున్న క్రుషికి ఆకర్షితులై బిజెపిలో చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, నగర మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, సీనియర్ నాయకులు కోమాల అంజనేయులు, వాసాల రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA



# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ
## తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్‌`అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# అసలైన పండగలా మా సినిమా
## అనగనగా ఒకరాజుపై నవీన్ పోలిశెట్టి

'సంక్రాంతి' పండుగలోని ఎనర్జీ అంతా 'అనగనగా ఒక రాజు' సినిమాలో ఉంటుంది. ఒత్తిడిని దూరం చేసి, హాయిగా నవ్వించే సినిమా ఇది. ఫ్యామిలీ అంతా హాయిగా కలిసి చూసే పర్‌ఫెక్ట్ పండుగ సినిమా అనమాట. బుకింగ్స్ చాలా బావున్నాయి. మిమ్మల్ని తప్పకుండా అలరించే సినిమా అవుతుంది.' అని హీరో నవీన్ పొలిశెట్టి చెప్పారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు'. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ నెల 14న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల అయ్యింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో నవీన్ పొలిశెట్టి మాట్లాడారు. తామంతా ఇష్టంతో కష్టపడి చేసిన సినిమా ఇదని, సినిమా చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉంటారనీ, మీ స్పందన కోసం ఎదురుచూస్తున్నామని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. బాధలన్నింటినీ మరపించి, రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వించే పర్‌ఫెక్ట్ సంక్రాంతి చిత్రమిదని డైరెక్టర్ మారి నమ్మకంగా చెప్పారు.



# నేనెందుకు క్షమాపణలు చెప్పాలి
## మలైకా అరోరా



ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరి కొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

### మన శంకరవరప్రసాద్
# కలెక్షన్ల దూకుడు
## రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక

ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తం చేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787